



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 12 బుధవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 176
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal, Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur





## తెలంగాణలోనూ కూటమి?

- ఏపీ తరహాలో తెలంగాణలోనూ కూటమి
- బీజేపీతో జతకట్టేందుకు టీడీపీ,జనసేన సిద్ధం
- గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుపై చర్చలు
- కిషన్‌రెడ్డి పొత్తు అంగీకరించకపోవడంతో వాయిదా
- బీజేపీ అధిష్టానమే పొత్తులు పెట్టుకోవాలని హుకుం
- బీజేపీతో టీడీపీ,జనసేన పొత్తు కుదిరితే జీహెచ్ఎంసీ
- ఎన్నికల్లో కమలందే హవా అంటున్న విశ్లేషకులు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత బీజేపీలో జోష్ పెరిగింది. బీఆర్ఎస్ అప్రమత్తం అయింది. కాంగ్రెస్ నేతల్లో అంతర్మధనం మొదలైంది. దీంతో, తెలంగాణలో పట్టు పెంచుకోవటం పైన పార్టీలు కొత్త వ్యూహాలు సిద్ధం చేస్తున్నాయి. ఇదే సమయంలో రాజకీయంగా కొత్త కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ఈ కూటమి బలం పరీక్షించుకుంటూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కు సమాయత్తం అయ్యేలా ఢిల్లీ కేంద్రంగా ఆపరేషన్ మొదలైంది. మారుతున్న లెక్కలు తెలంగాణలో ఎమ్మెల్సీ ఫలితాలు కొత్త లెక్కలకు కారణమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ సిట్టింగ్ స్థానం కోల్పోయింది. బీజేపీ రెండు సీట్లు గెలవటం తో ఉత్తర తెలంగాణలో తమ పట్టుకొనసాగించేలా వ్యూహాలు సిద్ధం చేస్తోంది. తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ సీట్లు గెలవటం పైన ప్రధాని మోదీ సైతం స్పందించారు. గెలిచిన వారిని ప్రధాని మోదీ అభినందించారు. తాజా ఫలితాల పైన సీఎం రేవంత్ మంత్రులతో సమీక్ష చేసారు. సమన్వయం లేని కారణంగానే ఓడిపోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ పూర్తి సమన్వయంతో బలం పెంచుకునేలా క్షేత్ర స్థాయిలో పని చేయాలని నిర్ణయించారు. ఇటు ప్రతిపక్ష నేత కేసీఆర్ తిరిగి ప్రజల్లోకి రావాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు అవుతారని చెబుతున్నారు. భారీ బహిరంగ సభకు ప్లాన్

## ఆర్కే రోజాకు ఏపీ సర్కార్ షాక్?



- రూ.400 కోట్లపై ఏసీబీ విచారణ..!
- గత వైసీపీ హయాంలో రోజాపై ఆరోపణలు
- వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడలు
- దాదాపు రూ.119 కోట్లను 45 రోజుల్లోనే ఖర్చు
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిధుల్ని మళ్లించి మొత్తంగా
- రూ.400 కోట్ల మేర ఈ పథకం కోసం ఖర్చు
- దీనిపై ఏసీబీతో విచారణకు సర్కార్ సిద్ధం

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ఏపీలో వైసీపీ మాజీ మంత్రి ఆర్కే రోజాకు భారీ షాక్ ఇచ్చేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో దాదాపు రూ.400 కోట్ల అవినీతికి సంబంధించి ఆమెను టార్గెట్ చేసేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు ఈ వ్యవహారంపై ప్రభుత్వాన్ని లాంఛనంగా ప్రశ్నించడం, చర్యలు తీసుకుంటామని ప్రకటన చేయడం కూడా జరిగిపోయింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏసీబీ దర్యాప్తుకు ఆదేశించబోతోంది. గత ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ఓ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా యువతకు క్రికెట్ కిట్లు ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా పోటీలు నిర్వహించారు. ఇందులో దాదాపు రూ.119 కోట్లను 45 రోజుల్లోనే ఖర్చు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా వివిధ నిధుల్ని మళ్లించి మొత్తంగా రూ.400 కోట్ల మేర ఈ పథకం కోసం ఖర్చు చేసినట్లు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నిన్న అసెంబ్లీలో ఇదే విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రశ్నించగా.. క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దర్యాప్తు చేయిస్తామన్నారు. ఈ మేరకు ఆడుదాం ఆంధ్రాలో జరిగిన అవకతవకలపై ఏసీబీతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం సిఫార్సు చేయబోతోంది. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అమల్లో అప్పటి క్రీడామంత్రి ఆర్కే రోజా కీలక పాత్ర పోషించినట్లు ప్రభుత్వం భావిస్తోంది. అందుకే ఆమెను ఫిక్స్ చేసేందుకు వీలుగా పావులు కదుపుతున్నారు. ఈ నిధుల విడుదల కోసం రోజా మంత్రిగా ఇచ్చిన ఆదేశాలు, క్షేత్రస్థాయిలో పెట్టిన వాస్తవ ఖర్చు, ఇలా ప్రతీ అంశంపై వివరాలను అధికారులు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. వీటి ఆధారంగా త్వరలోనే ఏసీబీ దర్యాప్తు చేసేలా ఆదేశాలు జారీ చేస్తారని సమాచారం. అదే జరిగితే

## అసెంబ్లీలో నిలదీయాలి

- అప్పుల విషయంలో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశనం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశనం
- కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేస్తూ హామీలు నెరవేర్చడం లేదు
- అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చిన కేసీఆర్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

అప్పుల విషయంలో కాంగ్రెస్ చేస్తోన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన అధ్యక్షతన బీఆర్ఎస్ శాసన సభా పక్ష సమావేశం జరిగింది. రేపటి నుండి

## డీలిమిటేషన్ తప్పదు!

- లోక్ సభ లేదా అసెంబ్లీ సీట్ల పునర్విభజన
- జరిగితే సీట్లు పెరుగుతాయే తప్ప, తగ్గవు
- రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ వెల్లడి

2



కేంద్ర మంత్రి రాజనాథ్ సింగ్ ఏమన్నారంటే.. లోక్ సభ లేదా అసెంబ్లీ సీట్ల పునర్విభజన జరిగితే ప్రస్తుతం ఉన్న సీట్లు పెరుగుతాయే తప్ప, తగ్గిపోవడం అంటూ ఉండదని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్

## స్టాక్ మార్కెట్‌లో మళ్లీ జోష్

- సెన్సెక్స్, నిఫ్టీలు దూకుడు.. మదుపర్లకు పండగే!
- అనూహ్యంగా పుంజుకుని లాభాల దిశగా దూసుకెళ్లిన స్టాక్‌మార్కెట్
- దీనికి కారణం ముడి చమురు ధరలు తగ్గడమేనన్న మార్కెట్ విశ్లేషకులు

2




ముంబై-నవభూమిబ్యూరో

దేశీయ స్టాక్ మార్కెట్ మళ్లీ కోలుకుంది! ఉదయం ట్రేడింగ్ నష్టాలతో ప్రారంభమైనప్పటికీ, మధ్యాహ్నం సమయానికి అనూహ్యంగా పుంజుకుని లాభాల దిశగా దూసుకెళ్లింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ రెండూ మళ్లీ తమ పాత జోష్‌ని సంతరించుకున్నాయి. ఈ మార్కెట్ అనూహ్య మలుపునకు ప్రధాన కారణం ఏమిటంటే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాకుండా, మార్కెట్లోని దిగ్గజ స్టాక్స్‌లో కొనుగోళ్ల జోరు పెరగడం కూడా సెంటిమెంట్ బలపడటానికి దోహదపడింది. మధ్యాహ్నానికి పూర్తిగా మారిన ట్రేడింగ్ సీన్: ప్రారంభంలో అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో మన మార్కెట్లు కూడా డీలా పడ్డాయి. కానీ, ట్రేడింగ్ మధ్యాహ్నానికి వచ్చేసరికి సీన్ పూర్తిగా మారిపోయింది. ఇన్వెస్టర్లు ఒక్కసారిగా కొనుగోళ్లపై దృష్టి పెట్టడంతో సూచీలు ఒక్కసారిగా పైకి ఎగబాకాయి. చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 74,102 పాయింట్ల వద్ద స్థిరపడింది, స్వల్ప 13 పాయింట్ల నష్టంతో ముగిసింది. నిఫ్టీ మాత్రం మరింత ఉత్సాహంతో 38 పాయింఈరోజు మార్కెట్ ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుండి చాలా ఒడుదుడుకులు ఎదుర్కొంది. ఒకానొక సమయంలో నిఫ్టీ ఏకంగా 22,300 స్థాయికి పడిపోయింది. కానీ, ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకుని, తిరిగి 22,500 మార్కును దాటి పైకి దూసుకెళ్లింది. ఈ ఊహించని రీబౌండ్‌కు

## త్వరలోనే కొత్త నోట్లు

- త్వరలోనే కొత్త రూ.100, రూ.200 నోట్లు విడుదల
- యాభై రూపాయల నోట్లు కూడా కొత్తవే
- ఈ కొత్త నోట్లపై గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకం
- మహాత్మ గాంధీ సిరీస్ తోనే కొత్త నోట్లు ఉంటాయని ఆర్బీఐ వెల్లడి



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

ఆర్బీఐ నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో రూ.100, రూ.200 కరెన్సీ నోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళవారం ప్రకటించింది. మహాత్మ గాంధీ సిరీస్ తోనే కొత్త నోట్లు ఉంటాయని ఆర్బీఐ పేర్కొంది. కొత్త నోట్లు అందుబాటులోకి వచ్చినా పాతనోట్లు చెల్లుబాటు అవుతాయని రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. శక్తికాంత దాస్ పదవీ విరమణ చేసిన అనంతరం సంజయ్ మల్హోత్రా ఆర్బీఐ గవర్నర్ బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు శక్తికాంత దాస్ పదవీ కాలం పొడిగించబడింది. అనంతరం సంజయ్ మల్హోత్రా 26వ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సంజయ్ మల్హోత్రా 1990 బ్యాచ్ రాజస్థాన్ కేడర్ ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన 3 సంవత్సరాల కాలానికి నియమితులయ్యారు. గతంలో రిజర్వ్ బ్యాంక్ కొత్త రూ.500 నోట్లను జారీ చేసింది. పాత రూ.1000 నోటను నిలిపివేసిన సంగతి తెలిసిందే. త్వరలో రూ.50 నోట్ల కూడా.. కొత్త రూ.50 నోటును విడుదల చేస్తున్నట్లు ఆర్బీఐ గతంలో ప్రకటించింది. ఈ కొత్త నోట్లపై గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకం కూడా ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ చెబుతోంది. కొత్త సిరీస్‌లోని మహాత్మ గాంధీ చిత్రం కూడా ఈ

## పాక్‌లో రైలు హైజాక్

- స్వతంత్ర బలోచిస్తాన్‌కై పోరాడుతున్న బలోచ్ విముక్తి సైన్యం జాఫర్ ఎక్స్ ప్రెస్ రైలు హైజాక్
- బందీలుగా 100 మంది ప్రయాణికులు ..!
- 6గురు సైనిక సిబ్బందిని కాల్చి చంపినట్లు సమాచారం

2



కరాచీ-నవభూమిబ్యూరో

పాకిస్తాన్‌లో ఇవాళ ఓ అరుదైన ఘటన చోటు చేసుకుంది. ఇప్పటివరకూ విమానాల హైజాక్ చూస్తుంటాం. కానీ పాకిస్తాన్‌లో ఓ ఎక్స్ ప్రెస్ రైలును తీవ్రవాదులు అపహరించుకుపోయారు. స్వతంత్ర బలోచిస్తాన్ కోసం పోరాడుతున్న బలోచ్ విముక్తి సైన్యం ఇవాళ జాఫర్ ఎక్స్ ప్రెస్ రైలును హైజాక్ చేసింది. ఈ సందర్భంగా ఎదురు తిరిగిన ఆరుగురు ప్రయాణికుల్ని కాల్చిచంపినట్లు తెలుస్తోంది. అలాగే మరో 100 మంది ప్రయాణికుల్ని బందీలుగా చేసుకుంది. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసింది తామేనని బలూచ్ లిబరల్ ఆర్మీ బాధ్యత ప్రకటించుకుంది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో .. పాకిస్తాన్ రైల్వేలు నడుపుతున్న రైలును హైజాక్ చేసినట్లు తెలిపింది. ఇందులో దాదాపు 100 మంది ప్రయాణికులను బందీలుగా ఉంచినట్లు తెలుస్తోంది. ఈ ఉగ్రవాద సంస్థ రైలును తన ఆధీనంలోకి తీసుకుని కనీసం ఆరుగురు సైనిక సిబ్బందిని కాల్చి చంపినట్లు తెలుస్తోంది. ఈ ఆపరేషన్‌ను మజీద్ బ్రిగేడ్ ఫతే స్క్వాడ్, నిర్వహిస్తున్నాయని ఆ బృందం ప్రతినిధి వెల్లడించారు. ఏదైనా సైనిక చర్యకు ప్రయత్నిస్తే బందీలందరినీ చంపేస్తామని బీఎల్‌ఏ

## తెలంగాణ గ్రూప్-2 ఫలితాలు విడుదల

- ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం
- గతేడాది డిసెంబర్ 15,16 వ తేదీల్లో 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి పరీక్ష
- ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది హాజరు
- నారు హర్షవర్ధన్‌కు మొదటి ర్యాంకు..కోదాడ కుర్రాడికి 2 ర్యాంకు



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో గ్రూప్ 2 ఫలితాలను అధికారికంగా ప్రకటించింది. టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. గతేడాది డిసెంబర్ 15,16 వ తేదీల్లో 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తుది కీ,OMR, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు జనరల్ ర్యాంకింగ్‌ను కింద ఇచ్చిన లింక్‌ని www.tspsc.gov.in ఉపయోగించి జాబితాలో తనిఖీ చేసుకోండి.
గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూప్ 2 టాపర్‌కు అత్యధికంగా 447 మార్కులు వచ్చాయి. జనరల్ ర్యాంకులతో పాటు ఫైనల్‌కీ కూడా విడుదలైంది. OMR షీట్స్‌ను అధికారిక వెబ్‌సైట్లో టీఎస్‌పీఎస్సీ అందుబాటులో ఉంచింది.

## ఎల్ఐసీకి రూ.1000 కోట్ల నష్టం

- బ్యాంకు షేర్లు పతనంతో ఎల్ఐసీకి భారీనష్టం

ముంబై-నవభూమిబ్యూరో

ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు సోమవారం ధమాలయ్యాయి. దింతో బ్యాంక్ షేర్లు 27.17% తగ్గి రూ.655.95 వద్ద ముగిశాయి, 5 సంవత్సరాలలో ఇదే అత్యల్ప స్థాయి. ఈ పతనం కారణంగా దేశంలోనే అతిపెద్ద లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ LIC దాదాపు రూ.1,000 కోట్ల నష్టాన్ని చవిచూసింది. LIC ఇండియాలోనే అతిపెద్ద దేశీయ సంస్థాగత పెట్టుబడిదారి కూడా. ఈ బ్యాంకులో LICకి 5.23% వాటా ఉంది. అలాగే బ్యాంక్ డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో కొన్ని అవకతవకలను నివేదించింది. ఇవన్నీ బ్యాంకు ఆదాయాలపై ఒకేసారి ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ కారణంగా బ్యాంక్ షేర్లు పడిపోయాయి, దీంతో నవంబర్ 2020 తర్వాత అత్యల్ప స్థాయికి చేరుకున్నాయి. 1 ఏప్రిల్ 2024 నుండి కొత్త రూల్స్ అమలు చేసింది. ఈ నిబంధనలను అనుసరించి బ్యాంక్ డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియో ఇంటర్నల్ రివ్యూ నిర్వహించింది. ఈ రివ్యూలో బ్యాంక్ కొన్ని అవకతవకలను కనుగొంది. దింతో బ్యాంకు ఆస్తులు, అప్పులకు సంబంధించిన అకౌంట్స్'లో ఈ అవకతవకలు బయటపడ్డాయి. బ్యాంకు ఇంటర్నల్ రివ్యూ ప్రకారం ఈ అక్రమాల ప్రభావం మొత్తం ఆస్తులలో దాదాపు 2.35%కి సమానం. అంటే దాదాపు రూ.2,000-2,100 కోట్లకు అంచనా. భారతదేశంలో బంగారు గనులు ఉండేవి ఇక్కడే.. తవ్వకాల ద్వారా ఎంత బంగారం ఉత్పత్తి అవుతుందంటే? ఎవరు నష్టపోయారు: ఇండస్ఇండ్ షేరు ధర రూ.654 కనిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు LIC షేర్ల విలువ రూ.2,434 కోట్లు. ముందు రోజు మార్కెట్ క్లోసింగ్ ధర ప్రకారం ఈ విలువ రూ.3,398 కోట్లు. LIC

## పోసానికి కర్నూలు కోర్టు బెయిల్ మంజూరు

- బెయిల్ మంజూరు చేసిన కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
- రూ. 20 వేల పూచీకత్తు, ఇద్దరు జామీన్‌తో బెయిల్ పోసాని రేపు జైలు నుండి విడుదలయ్యే అవకాశం



హైదరాబాద్-నవభూమిబ్యూరో

ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి కర్నూలు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కర్నూలు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పోసాని బెయిల్ పిటిషన్‌పై ఐదు రోజుల పాటు కోర్టులో వాదనలు జరిగాయి. రూ. 20 వేల పూచీకత్తు, ఇద్దరు జామీనుతో కోర్టు బెయిల్ ఇచ్చింది.భవానీపురం కేసులోనూ విజయవాడ కోర్టు పోసానికి బెయిల్ మంజూరు చేసింది. పోసాని రేపు జైలు నుండి విడుదలయ్యే అవకాశముంది. ఆయన ప్రస్తుతం కర్నూలు జైలులో ఉన్నారు. నిన్న నరసారావుపేట జిల్లా కోర్టు కూడా ఆయనకు బెయిల్ ఇచ్చింది.



## కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్‌కు ఢిల్లీ కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆమ్ ఆద్మీ పార్టీజాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారంనాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఎక్స్‌పై సైబర్ ఎటాక్.. ఉక్రెయిన్ హస్తం ఉందన్న ఎలాన్ మస్క్



**వాషింగ్టన్-నవభూమి:** అమెరికన్ టైకూన్, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ఆధీనంలోని ప్రముఖ సామాజిక మాధ్యమం ట్విట్టర్ (ఎక్స్) ఇటీవలే మాటిమాటికీ సతాయిస్తోంది. ఏదో ఒక సమస్యతో యూజర్లను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇటీవలే ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడటం.. లాగిన్ కాకపోవడం, ట్వీట్స్ మాయం కావడం వంటి సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడుతోంది. సైట్ ఓపెన్ కావడం లేదు. లాగిన్ అయినా యాక్సిస్ చేయలేక యూజర్లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితిపై ఎక్స్ బాస్ ఎలాన్ మస్క్ స్పందించారు. ఎక్స్‌పై భారీ సైబర్ దాడి జరిగినట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడిందని చెప్పారు. ఒక్క రోజులోనే మూడు సార్లు సేవలు నిలిచిపోయాయినట్లు తెలిపారు. దీని వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందని ఆయన ఆరోపించారు. 'ప్రతి రోజూ సైబర్ దాడికి గురవుతున్నాం. కానీ, ఇప్పుడు జరిగింది భారీ సైబర్ ఎటాక్. దీని వెనుక పెద్ద గ్రూప్ లేదా ఓ దేశ హస్తం ఉంది. ప్రస్తుతం ఏం జరిగిందనేది కచ్చితంగా చెప్పలేం. ఎక్స్ వ్యవస్థకు అంతరాయం కలిగించేందుకు జరిగిన భారీ సైబర్ దాడి ఇది. ఇందుకు పాల్పడిన ఐపీ అడ్రెస్‌లు ఉక్రెయిన్ ప్రాంతానికి చెందినదిగా తెలుస్తోంది' అని మస్క్ ఆరోపించారు. ట్రేసింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. సోమవారం ఒక్కరోజులోనే మూడు సార్లు ఎక్స్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ముందుగా సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పలువురు యూజర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత కాసేపటికే ఎక్స్ సేవలను పునరుద్ధరించారు. అయితే, తిరిగి సాయంత్రం 7.30 గంటల సమయంలో మరోసారి డౌన్ అయింది. ఇక రాత్రి 9 గంటలకు మళ్లీ సేవల్లో అంతరాయం నెలకొంది. దీంతో పలువురు ఎక్స్‌ను యాక్సెస్ చేసుకోలేకపోయారు. యూజర్లు ఫీడ్‌ను రిఫ్రెష్ చేయలేక, పోస్ట్‌లు అప్‌లోడ్ చేయలేకపోయారు. అమెరికా, ఇండియా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా వంటి ప్రధాన దేశాల్లో ఈ అంతరాయం నెలకొంది. అమెరికా, యూకేలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దాదాపు 40,000 మంది యూజర్లు ఈ సమస్య గురించి ఫిర్యాదు చేశారు. ఇందులో 52 శాతం వెబ్‌సైట్ సంబంధిత సేవలు, 41 శాతం మంది యాప్ సమస్యలు, 8 శాతం మంది సర్వర్ కనెక్షన్ ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు డౌన్‌డిటెక్టర్ పేర్కొంది. ఇక ఇవాళ కూడా ఎక్స్ సేవల్లో అంతరాయం కొనసాగుతోంది. సైట్ ఓపెన్ అయినప్పటికీ.. ఫీడ్‌న రిఫ్రెష్ చేయలేకపోతున్నారు.

## మద్యం కుంభకోణం.. మాజీ సీఎం కుమారుడికి ఈడీ సమన్లు



**ఛత్తీస్‌గఢ్-నవభూమి:** ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సమన్లు జారీ చేశారు. చైతన్య బఘేల్ మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఆయన నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆయనకు సమన్లుపంపారు. మార్చి 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల ముందు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. %మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. భిలాయ్‌లోని ఆయన నివాసంతోపాటు చైతన్య స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇలా రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.30 లక్షల నగదు, పలు పత్రాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, మద్యం కుంభకోణం ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని, మద్యం సిండికేట్‌కు రూ.21 వేల కోట్లకు పైగా లాభం చేకూరిందని దర్యాప్తు సంస్థ ఆరోపిస్తున్నది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నది. ఇందులో భాగంగానే చైతన్య బఘేల్ నివాసంలో అధికారులు సోదాలు చేపట్టారు.

## అందంగా ఉందని ప్రియురాలిని చంపేశాడు..



**లక్నో-నవభూమి:** తన స్నేహితురాలు అందంగా ఉన్నానని గర్వంగా భావిస్తుందని.. అలాగే తనతో నమ్మకంగా స్నేహం చేయడం లేదంటూ 17 ఏళ్ల యువతిని శివం వర్మ అనే యువకుడు గొంతు కోసి అత్యంత పాశవికంగా హత్య చేశాడు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. అనంతరం మృతురాలి స్నేహితురాలికి హంతకుడు ఫోన్ చేసి.. అందంగా ఉన్నానని మీ స్నేహితురాలు గర్వంగా ఫీలవుతుందంటూ ఫోన్ కట్ చేశాడు. ఈ నేపథ్యంలో జరిగిన విషయాన్ని మృతురాలి తండ్రికి ఆమె తెలియజేసింది. ఆయన హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే యువతి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉంది. ఆ వెంటనే ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. యువతి మృతదేహాన్ని పోస్ట్ మార్టంకు తరలించేందుకు సిద్ధమయ్యారు. అయితే మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆమె తరఫు బంధువులు ఆందోళనకు దిగారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేస్తామంటూ వారికి నచ్చ చెప్పడంతో.. దాదాపు రెండు గంటల అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ హత్యపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు హంతకుడు శివం వర్మను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక తమ విచారణలో శివం వర్మ చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. మరోవైపు నిందితుడు తమ ఇంటి వద్ద అద్దెకు ఉండేవారని మృతురాలి తండ్రి పోలీసులకు వెల్లడించారు. అతని ప్రవర్తన సరిగ్గా ఉండేది కాదని వివరించారు. ఈ కేసులో తన కుమార్తెకు న్యాయం చేయాలని మృతురాలి తండ్రి పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

# వీఐపీ ప్రోటోకాల్‌ను దుర్వినియోగం చేస్తూ బంగారం స్మగ్లింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టైన నటి రన్యారావు వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం రన్యా రావు డీఆర్ఐ కస్టడీలో ఉంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆమెను విచారిస్తున్నారు. వీఐపీ ప్రోటోకాల్‌ను దుర్వినియోగం చేస్తూ నటి రన్యారావు బంగారం అక్రమంగా రవాణా చేయడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో ప్రొటోకాల్ దుర్వినియోగం అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంలో రన్యా రావు సవతి తండ్రి, కర్ణాటకలో ఐపీఎస్ అధికారి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ కె. రామచంద్రరావు పాత్రపై కూడా ప్రత్యేకంగా దృష్టి చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తాను దర్యాప్తు అధికారిగా ప్రభుత్వం నియమించింది. దర్యాప్తును వెంటనే ప్రారంభించి వారంలోపు తుది నివేదికను అందించాలని ఆదేశించింది. రన్యా రావు దుబాయ్ నుంచి రూ.14 కోట్లకు పైగా విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన విషయం తెలిసిందే. రాన్యా ఇటీవతే తరచూ దుబాయ్ వెళ్లి వస్తుండడంతో ఆమెపై అధికారులు నిఘా పెట్టారు. 15 రోజుల్లో ఆమె నాలుగుసార్లు దుబాయ్ వెళ్లడాన్ని గమనించారు. ఎలాంటి అనుమానం రాకుండా.. గోల్డ్ బిస్కెట్లను దుస్తుల్లో దాచి, తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ఆమెపై నిఘా పెట్టిన డీఆర్ఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె ఎయిర్‌పోర్టులో దిగినప్పుడల్లా తాను డీజీపీ కూతురునని ప్రచారం చేసుకొనేదని తేలింది. ఆమెను అరెస్ట్ చేసిన అనంతరం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఎస్) అధికారులు లావెల్లె రోడ్‌లోని ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించగా రూ.2.06 కోట్ల విలువైన బంగారు నగలు, రూ.2.67 కోట్ల నగదు పట్టుబడ్డాయి. దీంతో పట్టుబడిన మొత్తం నగదు, బంగారం విలువ 17.29 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. విచారణలో భాగంగా రన్యారావు కీలక విషయాలు వెల్లడించింది. తాను దుబాయ్ నుంచి 17 బంగారు కడ్డీలను తీసుకుని వచ్చినట్టు ఆమె రెవెన్యూ అధికారులకు తెలిపింది. తాను దుబాయే కాక మధ్య ప్రాచ్య, యూరప్, అమెరికా, సౌదీ అరేబియా దేశాలు పర్యటించినట్టు తెలిపింది. ఈ ప్రయాణాల కారణంగా ప్రస్తుతం అలసిపోయానని, తనకు కొంత విశ్రాంతి కావాలని ఆమె కోరింది. తన తండ్రి కేఎస్ హెగ్డేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారి అని, తన భర్త జతీన్ హుక్కేరి ఆర్కిటెక్ట్ అని వివరించింది. తన విచారణ అంతా సక్రమంగానే సాగుతున్నదని, ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వచ్ఛందంగానే తాను ఈ ప్రకటన ఇస్తున్నానని తెలిపింది. స్మగ్లింగ్‌లో రన్యారావు పాత్రధారే తప్ప సూత్రధారి కాదని, ఇండో-ఆసియన్ న్యూస్ తన కథనంలో పేర్కొంది. దుబాయ్ నుంచి ఆమె బంగారాన్ని తెచ్చినందుకు కేజీకి 4-5 లక్షలు తీసుకుంటుందని తెలిపింది. కాగా, ఈ స్మగ్లింగ్ వెనుక ప్రముఖ రాజకీయ నేత హస్తం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

## ప్రధాని మోదీని చంపేస్తానంటూ చిన్నారి బెదిరింపులు..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏడెనిమిది సంవత్సరాల వయసున్న ఓ బాలిక ఏకే-47 చేత పట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీకి హత్య బెదిరింపులు చేసింది. రెండు దెబ్బలతోనే మీ ప్రాణాలు తీసేస్తానంటూ హెచ్చరించింది. మీరు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా సరే.. మా దేశానికి చెందిన అమ్మ, నాన్న, పిల్లలను చంపితే నేను అస్సలే ఊరుకోనని.. కచ్చితంగా చంపేస్తానంటూ వెల్లడించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా.. అసలీ అమ్మాయి ఎవరు, ఎందుకు ప్రధాని మోదీపై ఇంత కోపం పెంచుకుందని, అసలు ఆమె చేతిలోకి ఏకే-47 ఎలా వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. ఏకే-47 గన్ చేత పట్టుకున్న ఓ చిన్నారి.. మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి హెచ్చరికలు జారీ చేసింది. మిమ్మల్ని రెండే రెండు దెబ్బల్లో హత్య చేస్తానంటూ బెదిరించింది. ముఖ్యంగా "మిస్టర్ మోదీ.. నువ్వు ఎవరైనా కావొచ్చు, నువ్వు మరోసారి మా దేశాన్ని, అమ్మా, నాన్నలను, పిల్లలను చంపితే నీకు ఎదురుగా వచ్చి నేనే నిన్ను చంపేస్తాను" అంటూ వీడియోలో వివరించింది. అంతటితో ఆగకుండా నువ్వొక తెలివి తక్కువ వాడివి, నా తుపాకీ చూశావుగా.. ఇందులో చాలా బుల్లెట్లు ఉన్నాయి.. 50 ఉన్నాయని వెల్లడించింది. అలాగే ఇందులో రెండు రెండు బుల్లెట్లతో నిన్ను చంపేస్తానని వ్యాఖ్యానించింది. నువ్వు ఎప్పటికీ బ్రతక్కుండా చేస్తాను.. కనీసం వైద్యుడు కూడా నిన్ను బతికించలేడు.. నువ్వు ఎప్పటికీ భూమిలోనే చనిపోయి ఉంటావు అని చెప్పి.. నువ్వెప్పటికీ దుర్వాసన వస్తుంటావని వీడియోను ముగించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా అంతా షాక్ అవుతున్నారు. అసలు ఈ అమ్మాయి ఎవరు, ఆమె ఎక్కడ ఉందని ప్రశ్నిస్తున్నారు.

### ఉద్యోగంలోంచి తీసేశారని.. ముఠాతో వచ్చి

# బడిపై బాంబులు వేసిన డ్రైవర్



**న్యూఢిల్లీ-నవభూమి:** రోజులాగే ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులకు పాఠాలు చెబుతూ చాలా బిజీగా ఉన్నారు. అయితే ఇదే సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బడికి వచ్చి పాఠశాలపై బాంబు దాడులకు పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా గేటుపైనుంచి రాళ్లు విసురుతూ రచ్చ చేశారు. దీంతో బడిలోని విద్యార్థులు సహా ఉపాధ్యాయులంతా తీవ్రంగా భయపడిపోయారు. తలుపులు మూసుకుని మరీ తరగతి గదుల్లోనే ఉంటూ కిటికీల్లోంచి ఏం జరుగుతుందో చూశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవలే ఆ బడి యాజమాన్యం ఓ డ్రైవర్‌ను ఉద్యోగంలోంచి తీసేయగా.. అతడే ఇదంతా చేసి ఉంటాడని భావిస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. బిహార్ హాజీపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌పై సోమవారం రోజు దాడి జరిగింది. మొత్తంగా 8 మంది గుర్తు తెలియని వ్యక్తులు బడికి వచ్చి బాంబు దాడులకు పాల్పడ్డారు. అందిన రాళ్లతో గేటు పైనుంచి లోపలికి విసురుతూ రచ్చ రచ్చ చేశారు. అలాగే విపరీతమైన పొగ రేపుతూ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను తీవ్రంగా భయపెట్టారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లలందరినీ తరగతి గదుల్లోనే ఉంచి తలుపులు పెట్టారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే అంతలోపే ఆగంతకులు అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. దీంతో పోలీసులు సీసీటీవీ ఫుటేజీ పరిశీలించారు. మొత్తంగా 8 మంది దారుణానికి పాల్పడ్డట్లు గుర్తించారు. దీని ఆధారంగానే వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు పాఠశాల యాజమాన్యం తాము కొన్ని రోజుల క్రితమే ఓ డ్రైవర్‌ను ఉద్యోగంలోంచి తీసేశామని.. అతడే ఇదంతా చేయించి ఉంటాడని పోలీసులకు చెప్పారు. దీంతో ఈ కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# కస్టడీలో నన్ను వేధించారు..


### కోర్టులో రన్యా రావు సంచలన ఆరోపణలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దుబాయ్ నుంచి అక్రమ మార్గాల్లో బంగారం తీసుకొస్తూ అడ్డంగా దొరికిపోయిన కన్నడ నటి హర్షవర్థిని అలియాస్ రన్యా రావు మూడు రోజుల కస్టడీ పూర్తయ్యింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆమెను ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట సోమవారం హాజరు పరిచారు. దీంతో ఆమెను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ పంపుతూ న్యాయమూర్తి విశ్వనాథ్ సి గౌండర్ ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా కస్టడీలో ఏమైనా వేధించారా? టార్చర్ చేశారా? అంటూ జడ్జి ప్రశ్నించారు. కొద్దిసేపు మౌనంగా ఉన్న ఆమె.. ఒక్కసారిగా బోరున ఏడ్చింది.

డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తనను మాటలతో వేధించారని వాపోయింది. 'శారీరకంగా హింసించకపోయినా.. నేను ఇలా చేయకపోయినా లేదా అలా చేయకపోయినా పరిణామాలు దారుణంగా ఉంటాయని బెదిరించారు. మానసికంగా ఎంతో వేదనకు గురయ్యాను' అని ఆమె ఉద్వేగానికి గురయ్యారు. అయితే, ఆమెను ఏరకంగానూ వేధింపులకు గురిచేయలేదని దర్యాప్తు అధికారి స్పష్టం చేశారు. 'మేం అడిగినా.. ఆమె సమాధానం ఇవ్వడం లేదు. మౌనంగా ఉండిపోతోంది.. ఆధారాలు చూపించి, ప్రశ్నించినా ఆమె నోరువిప్పడం లేదు.. వా విచారణకు ఆమె సహకరించలేదు.. మా దర్యాప్తు ప్రక్రియ మొత్తాన్ని మేం రికార్డ్ చేశాం' అని ఆయన వివరించారు. రన్యా ఆరోపణలపై స్పందించిన న్యాయమూర్తి.. 'మీ లాయర్‌తో మాట్లాడేందుకు 30 నిమిషాల సమయం ఇచ్చాం.. వేధింపుల విషయం వారికి ఎందుకు చెప్పలేదు? దానిపై వారు పిటిషన్ ఎందుకు వేయలేదు?' అని ప్రశ్నించారు. 'భయపడాల్సిన అవసరం లేదు.. ఏదైనా ఆందోళనలు ఉంటే మీ లాయర్లతో చెప్పి పిటిషన్ దాఖలు చేయండి.. విచారణ ప్రక్రియ అంతా వీడియోలో రికార్డు అయింది.. కోర్టు ఇరు పక్షాల వాదనలు వింటుంది.. విచారణలో ఒకరి చెప్పింది విని నిర్ణయానికి రాదు.. వారితో పాటు మీ వాదనలు వింటాం.. ఇంకా విచారణ వీడియో రికార్డింగ్‌ను మేం పరిశీలిస్తాం... బలవంతంగా లేదా బెదిరింపుల ద్వారా స్టేట్‌మెంట్‌లు తీసుకుంటున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తే, మేము దానిపై చర్య తీసుకుంటాం.' అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలను డీఆర్ఐ తరఫు న్యాయవాది తోసిపుచ్చారు.

## కేంద్ర క్రీడా శాఖ కీలక నిర్ణయం.. సస్పెన్షన్ ఎత్తివేత



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. తద్వారా దేశీయ టోర్నమెంట్ల నిర్వహణకు, అంతర్జాతీయ టోర్నమెంట్లకు జాతీయ జట్ల ఎంపికకు రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు మార్గం సుగమం చేసింది. కాగా, WFI జరిగిన ఎన్నికల్లో సంజయ్ సింగ్ నేతృత్వంలోని ప్యానెల్ 2023 డిసెంబర్ 21న విజయం సాధించిన విషయం తెలిసిందే. సంజయ్ సింగ్ డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం అండర్-15, అండర్-20 జాతీయ పోటీలను ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయం కేంద్ర ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రెజ్లర్లు పోటీలకు సిద్ధమయ్యేందుకు సమయం ఇవ్వకుండా ప్రకటన వెలువరించిన కారణంగా కొత్త కార్యవర్గంపై వేటు వేసింది. క్రీడా శాఖ విధివిధానాలను అమలు చేయలేదనే కారణంతో తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని 2023, డిసెంబర్ 24న క్రీడా శాఖ వెల్లడించింది. అయితే, ప్రస్తుతం దిద్దిబాటు చర్యలు తీసుకున్న కారణంగా డబ్ల్యూఎఫ్ఐపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు క్రీడా మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## లాలూ తనయుడు తేజ్‌ప్రతాప్, కుమార్తె హేమకు బెయిల్



**న్యూఢిల్లీ-నవభూమి::** స్థలాలు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్ ప్రతాప్, కుమార్తె హేమ యాదవ్, తదితరులకు రౌస్ ఎవెన్యూ కోర్టు మంగళవారంనాడు బెయిలు మంజూరు చేసింది. ఈ కేసులో సమన్లు జారీ కావడంతో తేజ్ ప్రతాప్, హేమ యాదవ్ కోర్టుకు హాజరయ్యారు. దీంతో వీరికి కోర్టు రూ.50,000 పూచీకత్తు, అంతే మొత్తానికి ష్యూరిటీతో కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఇదే కేసులో లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవి, మిసాభారతి హాజరు కావాల్సి ఉండగా, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వీరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కేసులో తుది ఛార్జిషీట్లుతో సహా మూడు చార్జిషీట్లను సీబీఐ దాఖలుచేసింది. ఇందులో లాలూ ప్రసాద్, మరో 77 మందిని నిందితులుగా పేర్కొంది. ఈ ఛార్జిషీట్లను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గాగ్నే.. తేజ్ ప్రతాప్, హేమయాదవ్ తదితరులకు బెయిలు మంజూరు చేస్తూ, తదుపరి విచారణను మార్చి 20వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసు లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న 2004 నుంచి 2009 మధ్య కాలానికి సంబంధించినది. ఆయన హయాంలో నిబంధనలను పట్టించుకోకుండా రైల్వే గ్రూప్ డీ పోస్టుల్లో కొందరికి ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపణలున్నాయి. అందుకు ప్రతిగా లాలూ కుటుంబ సభ్యులు, ఇతర అనుచరుల పేరిట భూములను రిజిస్టర్ చేయించున్నారని సమాచారం. ఈ కేసులో క్రిమినల్ కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తుండగా, మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. దీంతో ఈ రెండు దర్యాప్తు సంస్థలు లాలూ కుటుంబ సభ్యులను పలుమార్లు విచారించాయి.

## మెట్రోరైళ్లలో యాంటీ ట్రాక్ సిస్టమ్..



**చెన్నై-నవభూమి:** మెట్రోరైళ్ల తలుపుల్లో బట్టలు, బ్యాగులు ఇరుక్కుపోకుండా కొత్త టెక్నాలజీ ప్రవేశపెట్టనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు తెలిపారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుతం నగరంలో నడుపుతున్న మెట్రోరైలు డోర్ సెన్సార్లు 10 మి.మీ మందం ఉంటేనే అడ్డంకులను గుర్తించగలవని తెలిపారు. అయినా, చాలా వరకు దుస్తులు, బ్యాగు పట్టీలు 0.3 మి.మీ కంటే తక్కువగా ఉండడంతో సెన్సార్లు వాటిని గుర్తించలేకపోతున్నాయన్నారు.

అలాంటి సమయంలో భద్రతా సిబ్బంది, ప్రయాణికులు ఎమర్జెన్సీ బటన్ నొక్కాల్సి ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించేలా అన్ని మెట్రోరైళ్లలో 'యాంటీ ట్రాక్ సిస్టమ్' అనే కొత్త టెక్నాలజీ అమర్చనున్నామని, ఇందుకు రూ.40 కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. మెట్రోరైలు డోర్ల మధ్య రబ్బర్ బెల్ట్స్ మార్చి ఈ కొత్త టెక్నాలజీతో కూడిన సెన్సార్ సిస్టమ్ ఏర్పాటుచేయనున్నామన్నారు. మెట్రోరైలు డోర్లలో చిక్కుకున్న వస్తువుల నుంచి వచ్చే స్వల్ప శక్తిని కూడా ఇది గుర్తించగలదని, అలాగే, ప్రయాణికుడిని లాగే సమయంలోనూ అత్యవసర బ్రేక్ పనిచేసేందుకు కూడా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.


## ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలంటే తమిళం రాయడం, చదవడం తెలియాల్సిందే..

**చెన్నై-నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలంటే తమిళం చదవడం, రాయడం తెలిసి ఉండాలని హైకోర్టు ధర్మాసనంస్పష్టం చేసింది. 2022లో విద్యుత్ బోర్డులో జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన తాను రెండేళ్లలో తమిళ భాషా పరీక్షలో ఉత్తర్ణత కాకపోవడంతో తనను విధుల నుంచి తొలగించారని, ప్రస్తుతం తాను టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన భాషా పరీక్ష పాసైనందున తనను మళ్లీ ఉద్యోగంలో చేర్చుకునేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ తేనికి చెందిన జయకుమార్ హైకోర్టును ఆశ్రయించగా.. సింగిల్ జడ్జి అతడికి అనుకూలంగా తీర్పునిచ్చారు. దీనిని సవాల్ చేస్తూ విద్యుత్ బోర్డు ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ పూర్ణిమతో కూడిన ధర్మాసనం ఆ అప్పీలుపై విచారణ జరిపింది. జయకుమార్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తండ్రి నౌకాదళాధికారి కావడంతో వరుస బదిలీలు జరిగేవని, అందువల్ల అతను సీబీఎస్ఈ సిలబస్ చదవాల్సి రావడంతో తమిళం నేర్చుకోలేకపోయాడన్నారు. ప్రస్తుతం తమిళ భాషా పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడని, అందువల్ల అతడ్ని విధుల్లోకి తీసుకోవాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలంటే తమిళంలో మాట్లాడడం, రాయడం తెలిసి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. తమిళనాడులోని ప్రభుత్వ ఉద్యోగులకు తమిళం తెలియకపోతే ఎలా? అతను రోజువారీ విధులు ఎలా నిర్వహించగలడని ప్రశ్నించింది. ఏ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైనా ఆ రాష్ట్ర భాష తెలిసి ఉండాలని అభిప్రాయపడింది. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే భాషా పరీక్షలో నిర్దేశిత వ్యవధిలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొంది. రాష్ట్ర అధికార భాష తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎలా ఆశపడతారని ప్రశ్నిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నిలుపుదల చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | బుధవారం | 12 । మార్చి । 2025



## రూ.318కే వంటగ్యాస్.. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం.. విషయం ఏంటంటే..



చెన్నై-నవభూమి:రాష్ట్రంలో రూ.318 లకు వంటగ్యాస్ ఇవ్వాలని, మే 1 నుంచి సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని, రాజధాని నగరం చెన్నైలో అందరికీ ఉచిత బస్ సదుపాయం కల్పించాలని పీఎంకేసోమవారం విడుదల చేసిన షాడో బడ్జెట్‌లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. ఈ షాడో బడ్జెట్‌ను పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు అన్బుమణి విడుదల చేశారు. మొత్తం 359 ప్రతిపాదనలతో ఈ బడ్జెట్ రూపొందించారు. రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రూ.5.43,442 కోట్లుగా చూపెట్టారు. ఇది గత యేడాదికంటే రూ.1,91,602 కోట్లు అధికమన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు క్వారీలకు బదులుగా ఖనిజవనరుల తవ్వకాలు చేపడితే ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో జులై 25 జన గణన నిర్వహించాలని, దీనికోసం రూ.400 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు.
స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనవరి 25 ప్రపంచ తమిళ మాతృభాషా దినంగా పాటించాలని, ఏప్రిల్ ఒకటి నుండి పాత పింఛన్ పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కూడా పేర్కొన్నారు. కోయంబేడు బస్‌స్టేషన్‌ను ఉద్యానవనంగా మార్చాలని సూచించారు.

## అయోమయంలో భారత యువత!

డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, అభ్యంతరాలతో భారత యువత అయోమయంలో పడింది. 'దూరపు కొండలు నునుపు' అన్న ట్టు తయారైంది అగ్రరాజ్యంలోని ఉన్నత విద్య. ప్రపంచం మొత్తం తమ చెప్పుచేతల్లో ఉండాలని భావిస్తున్న ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ఇతర దేశాలకు మరణశాసనంగా మారుతున్నాయి.2024, మే నాటికి దేశం వెలుపల నివసిస్తున్న భారతీయుల సంఖ్య దాదాపు 3.5 కోట్లు. ఇందులో సుమారు 1.58 కోట్ల మంది నాన్ రెసిడెంట్ ఇండియన్లు (ఎన్ఆర్ఐ). యూకే, కెనడా, అమెరికా, జర్మనీ, జపాన్, మలేషియా, దక్షిణాఫ్రికా, యూఏఈ, సౌదీ అరేబియా, సింగపూర్, మారిషస్, మయన్మార్ వంటి దేశాల్లో భారతీయులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎక్కు మంది విద్యార్థులే. దశాబ్దాలుగా సాగుతున్న ఈ సంప్రదాయానికి ట్రంప్ మంగళం పాడారు. అమెరికాలో చదువుకొనే విద్యార్థులు బుద్ధిగా చదువుకోవాలి తప్పితే పార్ట్‌టైం ఉద్యోగాలు చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఇది భారత్ సహా అనేకదేశాల విద్యార్థులకు శరాఘాతంగా మారింది. వర్క్ వీసా తో అమెరికా వెళ్లి పనిచేస్తున్న వారి కంటే ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లి ఖర్చుల వెతలు తీర్చుకొనేందుకు పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నవారే ఎక్కువ. ఎలాంటి ధ్రువీకరణ పత్రాల్లేకుండా అక్కడ నివసిస్తున్న వందల మంది భారతీయులను ఇటీవల భారత్‌కు తరలించారు.అమెరికా నుంచి పెద్ద ఎత్తున వెనక్కి వస్తున్న వారితో దేశంలో నిరుద్యోగ సమస్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. 2024, జూన్ నాటికి దేశంలో నిరుద్యోగిత రేటు 9.2 శాతంగా ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. జీ-20 దేశాల నిరుద్యోగిత రేటులో భారత్ మూడో స్థానంలో ఉన్నది. మరోవైపు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ నిరుద్యోగం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. 2024, మేలో గ్రామీ ణ ప్రాంతాల్లో ఇది 6.3 శాతం ఉండగా, జూన్ నాటికి 9.3 శాతానికి ఎగబాకింది. పట్టణ ప్రాంతాల్లో అదే ఏడాది మే నెలలో 8.6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు జూన్ నాటికి 8.9 శాతానికి పెరిగింది. కార్మిక భాగస్వా మ్య రేటు (లేబర్ పార్టనర్‌షిప్ రేట్) మేలో 40.8 శాతం ఉండగా జూన్ నాటికి 41.4 శాతానికి పెరిగింది. 2024, జూన్‌లో ఉపాధి రేటు 38 శాతం నుంచి 37.6 శాతానికి దిగజారింది.ఈ నేపథ్యంలో భారత్‌లో నిరుద్యోగ సమస్య మరోమారు భయపెట్టే అవకాశం కనిపిస్తున్నది. ఎన్నో ఆశలు పెట్టుకొని, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అమెరికా వెళ్లిన యువత ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని స్థితిలో కూరుకుపోయింది. పార్ట్‌టైం ఉద్యోగాలతో చదువులు నెట్టుకొస్తు న్న యువత చదువు ముందుకుసాగేదెలానో తెలియక అల్లాడిపోతున్నా రు. ఇప్పటికే తమ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టలేక తమలో తామే మథనపడుతున్నారు. అమెరికా నుంచి వచ్చిన వారి వివరాలు ప్రభుత్వం వద్ద ఉంటాయి కాబట్టి తక్షణమే వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. భయాందోళనల మధ్య భారత్ చేరుకున్న వారిలోని నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకుని స్టార్టప్‌లు నెలకొల్పేందుకు సాయం చేయాలి. అలా చేయడం వల్ల ఒకరిద్దరికే కాకుండా వారి ద్వారా మరెంతోమంది నిరుద్యోగులకు ఆసరా లభిస్తుంది. కాబట్టి ఈ విషయం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయం తీసుకోవాలి.
విదేశీ విద్య యువత కల. దానికోసం సప్త సముద్రాలు దాటి అమెరికా, బ్రిటన్ , ఆస్ట్రేలియా, కెనడా, యూరప్ వంటి సుదూర తీరాలకు చేరుతుంటారు. రెండేళ్లు కష్టపడితే ఎంఎస్ చేస్తే చాలు ఏదో మంచి ఉద్యోగం సంపాదించవచ్చు, లైఫ్ సెటిల్ అవుతుంది అనుకుంటారు. అందుకే అప్పులు చేసి మరీ అమెరికా విమానం ఎక్కుతూంటారు. కానీ, అంతర్జాతీయ పరిస్థితులు మారాయి. గతంతో పోలిస్తే విదేశాల్లో ఉద్యోగావకాశాలు తగ్గాయి.ఇంటర్న్‌షిప్‌లు కూడా దొరకటం కష్టంగా మారింది. మరోపక్క వీసా చిక్కులు ఉండనే ఉన్నాయి. దీంతో కొంతమంది విద్యార్థులు స్వదేశీ బాట పడుతున్నారు. కొత్తగా వెళ్లాలనుకునే విద్యార్థులు అయోమయంలో ఉన్నారు?మరోవైపు కొన్నిదేశాలు ఇప్పటికే ఇదే పంథాను కొనసాగిస్తూ కీలకమైన వీసాలపై నిబంధనలను కఠినతరం చేసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతిష్టంభనలే ప్రస్తుత పరిస్థితులకు కారణమని నిపుణలు అంచనా వేస్తున్నారు. లక్షలు పోసి విదేశాల్లో విద్య అభ్యసిస్తున్నా ఆశించిన స్థాయిలో ఉద్యోగాలు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి. అయితే, అంతా అమెరికా బాట పట్టడం కూడా మంచిది కాదని చాలా మంది నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఎందుకంటే లక్షల మంది విద్యార్థులు ఒకే దేశం నుంచి వెళ్తుండటం ఒకే ప్రాంతంలో పెద్ద ఎత్తున స్థిర పడుతుంటడం కూడా ఆ దేశంలోని స్థానికులను కాస్త ఇబ్బందికి గురి చేసే పరిణామమే. గతంలో స్థిరపడిన వారయితే ఎలాగోలా నెట్టుకురావచ్చు. కానీ, కొత్తగా విదేశాల బాట పట్టేవారు ప్రత్యామ్నాయ దేశాలవైపు మ్మొగ్గు చూపాలని కోరుతున్నారు. అదే విధంగా స్వదేశంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచనలు చేస్తున్నారు. మరి ఇవన్నీ చూసిన తర్వాతైనా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విదేశీ విద్య విషయంలో పంథాను మార్చుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు హితవు పలుకుతున్నారు.

# బంగ్లా విద్యార్థుల పార్టీ!



బంగ్లాదేశ్‌లో షేక్‌హసీనా పాలనమీద తిరుగుబాటు చేసి, అమెను గద్దెదించే లక్ష్యంతో సుదీర్ఘకాలం ఉద్యమాన్ని నడిపించిన విద్యార్థినాయకులు ఇటీవల ఒక కొత్త పార్టీ ఆరంభించడం విశేషమైన పరిణామం. పార్లమెంట్ భవనం ఎదురుగా వేలాది విద్యార్థినీ విద్యార్థుల సమక్షంలో నేషనల్ సిటిజెన్స్ పార్టీ (ఎన్సీపీ) ఆరంభం ఘనంగా జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటాలకు వ్యతిరేకంగా ఆరంభమైన ఒక ఉద్యమం, అనంతరకాలంలో కొత్త శక్తుల ప్రవేశంతో హసీనా వ్యతిరేక ఉద్యమంగా రూపాంతరం చెంది, అంతిమంగా ఆమె స్వదేశాన్ని వీడి భారత్ చేరింది. ఎన్సీపీ ఏర్పాటు అంత సునాయాసంగా ఏమీ సాధ్యపడలేదని, జమాతే ఇస్లామీ విద్యార్థి సంఘానికి చెందిన ఇద్దరు నాయకులకు చోటిచ్చే విషయంలో వివాదం రేగి, తిరుగుబాట్లు, సర్దుబాట్లతో ప్రస్తుతానికి సద్దుమణిగిందని అంటారు. రాబోయే కాలంలో విద్యార్థినాయకులంతా ఒక్కటిగా, పటిష్ఠంగా పార్టీని ముందుకు తీసుకుపోగలరా అన్నది అటుంచితే, బంగ్లాదేశ్ రాజకీయాలను దశాబ్దాలుగా గుప్పిట్లో పెట్టుకున్న రెండు వంశాలకు ఈ కొత్త పార్టీ సవాలు విసిరే సూచనలైతే ఉన్నాయి.
బంగ్లాదేశ్ పితామహుడు షేక్ ముజ్‌బూర్ రహ్మాన్ కుమార్తె హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ ఒకవైపు, సైనిక పాలకుడు జియావుర్ రహ్మాన్ కుమార్తె ఖలీదాజియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పి) మరొకవైపు ఉంటూ పరస్పర ఘర్షణలతో దేశాన్ని ఒక యుద్ధక్షేత్రంలాగా మార్చేశారు. వారి వైరానికి వందలాదిమంది బలైనారని తెలిసిందే. ఎవరు అధికారంలో ఉన్నా ఎదుటిపక్షం నాయకులను జైళ్ళలో పెట్టడానికీ, కార్యకర్తల ప్రాణాలు తీయడానికి వెనుకాడేవారు కాదు. ఈ ఇరువురి అనంతరం దేశాన్ని ఏలడానికి వారసులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. హసీనాను దేశంనుంచి తరిమివేసి, ఖలీదాజియాను జైలునుంచి బయటకు తేవడం ఇటీవలి పరిణామం. ఖలీదా కుమారుడు బిఎన్‌పి నాయకత్వహోదాలో ఉంటూ, ఇంతకాలమూ వెనుకపట్టుపట్టిన పార్టీని ఉద్ధరించే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా ఒక కొత్తపార్టీ పెట్టడం రెండు ప్రధానపార్టీలకూ పెద్ద సమస్యే.
ఉద్యమానంతరం ఒక తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన వీరిని, దేశానికి నాయకత్వం వహించడానికి ప్రజలు అంగీకరిస్తారా? అన్నది ప్రధానం. పార్టీ డిక్లరేషన్ ఎంతో అందమైన, ఉన్నతమైన ఆదర్శాలనూ, ఆశయాలనూ ప్రకటించింది. దారిద్ర్యం, అసమానతలు, అధికార దుర్వినియోగం నుంచి ప్రజలకు రక్షణలను ఇస్తామన్నది. ప్రజల్లో ఏ వర్గాన్నీ నిర్లక్ష్యం చేయబోమనీ, సామాజిక, సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని కాపాడుతూ, బహుళత్వాన్ని పరిరక్షించుకుంటూ, సుసంపన్నమైన దేశాన్ని నిర్మించుకుంటామని ప్రకటించింది. నాయకత్వస్థానాల్లో మహిళలు, దళితులకు ప్రాతినిధ్యం దక్కడం, కోటా వ్యతిరేక ఉద్యమంలో కనిపించిన అన్ని వర్గాలకూ ఇప్పుడూ చోటు ఉంటూ, పార్టీ నాయకత్వం వైవిధ్యభరితంగా ఉండటం మెచ్చదగింది. ఇక, భారత్ అనుకూల, పాకిస్థాన్ అనుకూల రాజకీయాలకు తమ దేశంలో చోటులేదని ఎన్సీపీ కన్వీనర్ చేసిన ప్రకటన ఆచరణసాధ్యమైనదేనా? అన్నది ప్రశ్న. దేశప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనే నవీన వ్యవస్థల, విధానాల నిర్మాణం జరుగుతుందని ఆయన అన్నారు. ఇది అవామీలీగ్, బిఎన్‌పిలకంటే జమాత్‌ను దృష్టిలో పెట్టుకొని చేసిన వ్యాఖ్య అని విశ్లేషకుల అభిప్రాయం. హసీనా లేకపోవడంతో జమాత్ అన్ని రంగాల్లోనూ చక్రం తిప్పుతోందని, ప్రభుత్వ ఉద్యోగాల్లోకి చొరబడుతోందని వార్తలు వినబడుతున్న నేపథ్యంలో, అది స్వయంగా తన విద్యార్థినాయకులతో ఒక పార్టీ పెట్టించే పనిలో ఉందని కూడా అంటున్నారు.
దేశం సంక్లిష్టమైన స్థితిలో ఉండగా, యూనస్ ప్రభుత్వంమీద ప్రజావిశ్వాసం సన్నగిల్లుతున్న నేపథ్యంలో ఎన్సీపీ ఆవిర్భావం జరిగింది. ఇప్పటివరకూ ఈ విద్యార్థి నాయకులకు మంచిపేరే ఉన్నందున, అవినీతి రహిత స్వచ్ఛ రాజకీయాలకు కట్టుబడివుంటామన్న వారి హామీని ప్రజలు విశ్వసించవచ్చు. పార్టీ ర్యాలీలో ఖురాన్, భగవద్గీత పఠనం బహుళత్వానికీ, లౌకికవాదానికి కట్టుబడివుంటానన్న హామీకి రుజువు కావచ్చు. మతవాద జమాత్, మితవాద బీఎన్పీల విలువలు, సిద్ధాంతాలకు దూరంగా, భిన్నంగా నడవాలనుకుంటున్న ఈ పార్టీని బంగ్లాదేశ్ ప్రజలు ఎంత ఆదరిస్తారో చూడాలి.

## 'పిలుపునివ్వటం'తోనే ఆగిపోరాదు!



ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా మహిళా దినోత్సవం సందర్భంగా కొన్ని పిలుపులు ఇస్తుంది. ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయంగా మహిళల, బాలికల హక్కులు, సమానత్వం, సాధికారత కోసం పిలుపునిచ్చింది. ఐతే పిలుపునివ్వడం వరకే సరిపోదు, దానికి తగ్గ దిశానిర్దేశం ఉండాలి. ఇవి లేవు కాబట్టే ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలలో మహిళల నిరసనలు ఆందోళనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. పాకిస్థాన్‌లో మహిళలపై హింస, అదృశ్యం, హత్యలు, పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యం లేకపోవడం వంటి సమస్యలను హైలైట్ చేస్తూ వేలాది మంది మహిళలు 'ఔరత్ మార్చ్' జరిపారు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్‌ల అణచివేతకు వ్యతిరేకంగా మహిళలు, కళాకారులు, విద్యావేత్తలు నిరసనలు తెలుపుతున్నారు. ఇరాన్‌లో నివురుగప్పిన నిప్పులా ప్రతిఘటన ఏకమవుతున్నది. పాలస్తీనా మారణహోమానికి వ్యతిరేకంగా అక్కడి మహిళా జర్నలిస్టులు, కళాకారులు తమ నిరసనను ప్రపంచ ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.భారతదేశంలో పర్యావరణ విధ్వంసానికి వ్యతిరేకంగా మణిపూర్, ఛత్తీస్‌గడ్, లడక్‌లో ప్రజలు, ముఖ్యంగా మహిళలు, పోరాటాలు చేస్తున్నారు. మధ్యభారతంలో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు వేలాదిగా పోలీస్ క్యాంపులు పెడుతూ మహిళలపై చేస్తున్న లైంగిక దాడులు, హింస, హత్యలకు వ్యతిరేకంగా అక్కడి మహిళలు ఉద్యమిస్తున్నారు. ఈ అంతర్జాతీయ, జాతీయ పోరాటాలు మహిళలపై నేటికీ జరుగుతున్న హింసను సూచిస్తున్నాయి. ఈ పరిస్థితిలో మహిళల అభివృద్ధిని ఎలా ఆశించగలం? ఉన్నత న్యాయస్థానాలు సైతం నేడు మహిళా వ్యతిరేక తీర్పులు ఇస్తూ తమ పితృస్వామిక భావజాలాన్ని చాటుకుంటున్నాయి. లైంగిక నేరాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో తెలంగాణలో 72వ ప్రపంచ సుందరి అందాల పోటీలు హైదరాబాదులో ప్రారంభం అవుతున్నాయి. 1996లో ప్రపంచ సుందరి పోటీలు బెంగళూరులో జరిగినప్పుడు అన్ని మహిళా సంఘాలు

## వర్గీకరణ మెడపై '371డి' కత్తి!




ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఏర్పాటు చేయబడిన జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ఎమ్మార్పీఎస్ అభ్యంతరాల నేపథ్యంలో ఆ కమిషన్ గడువును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఇప్పటికే ఆ కమిషన్ ఎస్సీ రిజర్వేషన్లను ఎ, బి, సి అనే మూడు గ్రూపులుగా విభజించింది. అయితే తర్వాత వచ్చే నివేదికలో నాలుగు గ్రూపులుగా చేస్తుందా? మాదిగల రిజర్వేషన్ శాతాన్ని 11 లేదా 12 శాతానికి పెంచుతారా? అలా పెంచితే ఎవరికి తగ్గిస్తారు? అంటే మాలలకు 5 శాతంగా కేటాయించిన దాన్ని 4 లేదా 3 శాతానికి తగ్గిస్తారా? అలాగే మాల, మాదిగ కాని కులాలు గతంలో లాగానే అవే గ్రూపులో ఉంటాయా, వేరే గ్రూపుల్లోకి మార్చబడతాయా? వారు డిమాండ్ చేసినట్లు వారి రిజర్వేషన్ శాతాన్ని కూడా గతం కంటే పెంచుతారా? %-% అనే వాటికి సమాధానాల కోసం వేచి చూడాలి.ఇలా రాజకీయ ఒత్తిడితోను, రాజకీయ ప్రయోజనాల కోసమూ మార్పులు, చేర్పులు చేయిస్తే అంతిమంగా అది సుప్రీంకోర్టులో నిలబడుతుందా అనే సమస్య ఎలాగూ ఉన్నది. అలాగే తెలుగు రాష్ట్రాలలో ఉనికిలో ఉన్న ఆర్టికల్ 371డి అనే మరో పెద్ద సమస్య కూడా ఉన్నది. కానీ దీన్ని గురించి ఎవరూ మాట్లాడటం లేదు.ఈ ఆర్టికల్ 371డి అనేది 1973లో 32వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉనికిలోకి వచ్చింది. దేశంలో కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఉద్దేశించబడినది. ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాలను, వెనుకబాటుతనాన్ని తగ్గించడం కోసం ఉద్యోగ నియామకాలు జోనల్, జిల్లా, స్థానిక స్థాయిల ఆధారంగా జరగాలని నిర్దేశిస్తున్నది. ఈ 371డి తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికీ ఉనికిలో ఉంది. అటువంటప్పుడు కేవలం రాష్ట్ర సగటు ఆధారంగా వర్గీకరణ గ్రూపులు చేస్తే అది రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించటమే అవుతుంది కదా. కాబట్టి జోనల్, జిల్లా, స్థానిక స్థాయిలలో కూడా రిజర్వేషన్లను వర్గీకరణ చేయాలి. రాష్ట్ర సగటులు జిల్లాలలో పనిచేయవు. ఎందుకంటే తెలంగాణలో ఎక్కువ జిల్లాలలో మాదిగలు ఎక్కువ, తక్కువ జిల్లాలలో మాలలు ఎక్కువ సంఖ్యలో ఉండటం కనబడుతుంది. ఉదాహరణకి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలలో మాదిగల జనాభా ఎక్కువ. అక్కడ జిల్లా స్థాయి పోస్టులకు సంబంధించి రాష్ట్ర సగటుల ఆధారంగా ఉద్యోగ నియామకాలు చేపడితే వారు నష్టపోతారు. కాబట్టి 371డి ప్రకారంగా జిల్లా స్థాయిలోనే గాక జోనల్, స్థానిక స్థాయి ఆధారంగా కూడా వర్గీకరణ జరగాలి. అప్పుడు జోనల్‌లో జరిగిన వర్గీకరణ జిల్లాలో ఉండదు. జిల్లాలో వర్గీకరణ స్థానిక స్థాయిలో ఉండదు. ఈ విధంగా ఒక దగ్గర ఉన్న గ్రూపులో ఉన్న కులాలు మరో దగ్గర ఉండవు. ఎక్కువ జనాభా కలిగిన మాదిగ, మాల కులాలకు ఈ పద్ధతి ఉపయోగకరంగా ఉండవచ్చు కానీ వందల్లో వేలల్లో జనాభా కలిగిన ఇతర షెడ్యూల్ కులాలకు కొన్ని సమస్యలు ఎదురవుతాయి.మరి దీని నుంచి బయటపడే మార్గం ఏమి లేదా? అంటే ఉంది. అదేమంటే, వర్గీకరణను కులాల వారి జనాభా శాతాన్ని బట్టి కాక, ఆయా కులాలలో జరిగిన అభివృద్ధి, వెనుకబాటుతనం ఆధారంగా చేపట్టడం. అంటే వారిలో విద్య, ఉద్యోగాలు, ఇతర ఉపాధి అవకాశాల ఆధారంగా ముందు వరుసలో ఉన్న వారిని గుర్తించాలి. అదే సమయంలో ఇంకా ఆయా కులాలలో భూమి లేక రెక్కాడితే గానీ డొక్కాడని వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఇలాంటి వారే ఇప్పటివరకు రిజర్వేషన్ల అవకాశాలను పొందటంలో వెనకబాటుకు గురయ్యారు. కాబట్టి వీరి అభివృద్ధి, వెనుకబాటు ఆధారంగా వర్గీకరణ చేయడం వల్ల 371డి సమస్య ఉత్పన్నం కాదు. రిజర్వేషన్లు ఇప్పటివరకు ఎవరికైతే అందటం లేదో వారికి అందాలంటే ఈ పద్ధతే శాస్త్రీయంఇలాగాక కులాలవారీగా వర్గీకరణ చేయడం వల్ల ఆయా కులాల్లో ఇప్పటికే రిజర్వేషన్ పొంది అభివృద్ధి చెందినవారు ఇప్పుడు కులాలవారీగా కల్పిస్తున్న రిజర్వేషన్ అవకాశాన్ని తిరిగి పొందటంలో ముందు వరుసలో ఉంటారు. అందువల్ల ఆయా కులాలలో ఉన్న పేదలు మరలా రిజర్వేషన్లను పొందలేని స్థితిలోకి నెట్టబడతారు. ఏ ఉద్దేశం కోసమైతే రిజర్వేషన్లు వర్గీకరించాలని కోరుతున్నామో ఆ లక్ష్యం నెరవేరదు.అన్ని కులాలలో అభివృద్ధి చెందిన వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. ఇలాంటి వారందరూ ఒక గ్రూపులో ఉండటం వల్ల వారి సంఖ్య ఆధారంగా వారికి తక్కువ రిజర్వేషన్ ఉండటంతో ఆ రకంగా వారు ఎక్కువగా రిజర్వేషన్ పొందే అవకాశం ఉండదు. అప్పుడు ఎక్కువగా ఉండే పేదలకు అదే శాతంలో రిజర్వేషన్ అందుబాటులోకి వస్తుంది. సామాజిక న్యాయం అంటే ఇదే కదా. ఇప్పటికైనా వైషమ్యాలు తగ్గించి ఐక్యతను పెంచే, కుల నిర్మూలనకు బాట వేసే శాస్త్రీయ వర్గీకరణ జరగాలని కోరుదాం.

## స్త్రీలలోని ఈ 3 లక్షణాలు.. పురుషుల మనసును గెలుచుకుంటాయి..

భక్తి



చాణక్యుడి ప్రకారం, స్త్రీలలో కొన్ని లక్షణాలు ఉంటాయి. అవి వారిని ప్రభావవంతమైనవిగా చేస్తాయి. ఈ లక్షణాలు ఉన్న స్త్రీ లను పురుషులు ఎంతగానో గౌరవిస్తారు. ఆ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..
ఆచార్య చాణక్యుడి విధానాలు నేటికీ జీవితంలోని ముఖ్యమైన అంశాలను అర్థం చేసుకోవడంలో మనకు సహాయపడతాయి. స్త్రీలు విజయం సాధించడంలో సహాయపడటమే కాకుండా సమాజంలో వారి ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకోవడానికి సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలను ఆయన ప్రస్తావించారు. చాణక్యుడి ప్రకారం, స్త్రీలలో కొన్ని లక్షణాలు ఉంటాయి. అవి వారిని అసాధారణమైనవిగా, ప్రభావవంతమైనవిగా చేస్తాయని తెలిపారు. ఆ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..
ధైర్యం : ఆచార్య చాణక్యుడి ప్రకారం, పురుషుల కంటే స్త్రీలకు ధైర్యం ఎక్కువ. అది సంక్షోభం అయినా లేదా సవాలు అయినా, మహిళలు తమ సంకల్ప శక్తి, బలమైన నాయకత్వంతో ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కొంటారు. ఈ గుణం వారికి పురుషుల కంటే ఎక్కువ గౌరవాన్ని ఇస్తుంది. ఈ కారణంగా, పురుషులు ఈ మహిళలకు నమస్కరిస్తారు.
జ్ఞానం : చాణక్య నీతి ప్రకారం, స్త్రీలు ఎక్కువ తెలివైనవారు, ఆలోచనాపరులు. ఆమెకు ప్రతి సమస్యను తెలివిగా పరిష్కరించగల సామర్థ్యం ఉంటుంది. సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా సరైన పరిష్కారాన్ని కనుగొంటుంది. పురుషులు మార్గం కనుగొనలేనప్పుడు, స్త్రీలు తమ ఆలోచన, జ్ఞానంతో వారిని నడిపిస్తారు.
భావోద్వేగం : చాణక్యుడు కూడా స్త్రీలు స్వభావరీత్యా చాలా దయగల, భావోద్వేగపూరితమైనవారని చెప్పాడు. వారి ఈ లక్షణం పురుషుల హృదయాలను తాకుతుంది. ధైర్యంతో పాటు, వారి దయగల స్వభావం వారిని జనసమూహంలో ప్రత్యేకంగా నిలబెడుతుంది. ఈ గుణం పురుషులు తమ కఠినత్వాన్ని, అహంకారాన్ని విడిచిపెట్టి, వారి ముందు గౌరవంగా ప్రవర్తించేలా చేస్తుంది.
స్వచ్ఛమైన హృదయం : చాణక్యుడు స్త్రీలు చాలా విశాల హృదయులు అని నమ్మాడు. క్షమించే మనస్తత్వం ఉన్న స్త్రీలు ఎవరిపైనా పగ పెంచుకోరు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులను క్షమించరు. ఈ గుణం వారిని అంతర్గతంగా బలంగా మార్చడమే కాకుండా సమాజంలో గొప్ప గౌరవాన్ని కూడా సంపాదిస్తుంది. స్వచ్ఛత, విశాల హృదయం కలిగిన స్త్రీలు కూడా పురుషులు తమ అహాన్ని వదులుకోవడానికి ప్రేరేపిస్తారు.

## వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!



ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్లు ఆరోగ్యానికి మంచివి.మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్లు తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.

సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్, స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహా లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా

# పవర్‌'తో గెలుపే లక్ష్యంగా



పోలియోతో రెండేళ్ళ వయసు నుంచి ఇంటికే పరిమితమైనా... ఏనాడూ నైరాశ్యాన్ని ఆమె దగ్గరకు రానీయలేదు. 41 ఏళ్ళ వయసులో ఎదురైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. పట్టుదలతో సాధన చేసి విజయాలు అందుకుంటున్నారు. పారా పవర్‌లిఫ్టింగ్‌లో కేరళ తరపున ఎన్నో ఘనతలు సాధించిన పి.వి. లతిక వచ్చేవారం జరగబోయే జాతీయ పోటీల్లో మరోసారి పతకాల వేటకు సిద్ధమవుతున్నారు.

"కొన్నాళ్ళ క్రితం కన్నూర్‌లోని ఒక పాఠశాలలో నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యాను. కార్యక్రమం ముగిసిన తరువాత ఒక విలేకరి "ప్రతిష్టాత్మకమైన పోటీల్లో పతకాలు సాధించారు కదా! మీ జీవితంలో అత్యుత్తమంగా అనిపించిన సందర్భం ఏది?" అని అడిగారు. "ఇదే... ఈ కార్యక్రమానికి హాజరు కావడమే" అని చెప్పాను. అది అక్షరాలా నిజం. ఎన్నడూ బడి ముఖం కూడా చూడని నేను రెండువేల మంది విద్యార్థులున్న పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావడం కన్నా గుర్తుండిపోయే సందర్భం ఇంకేం ఉంటుంది? "నా మాటలు అందరూ శ్రద్ధగా విన్నారు. వారిలో కొందరికైనా నా ద్వారా ప్రేరణ కలిగి ఉండే ఉంటుంది. అది ఎంతో సంతృప్తి కలిగిస్తోంది" అని అన్నాను.

**పాకుతూ తిరిగేదాన్ని...**

అందరిలా బడికి వెళ్ళాలి. బాగా చదువుకోవాలి... ఇది నా తీరని కోరిక. కానీ రెండేళ్ళ వయసులో పోలియో వచ్చి, నా కాళ్ళు చచ్చుబడిపోవడంతో అది నెరవేరలేదు. మాది కేరళలోని పయ్యన్నూర్ సమీపంలో ఉన్న మాతమంగళం అనే ఊరు. మా నాన్న పోర్టర్. అమ్మ వ్యవసాయ కూలీ. నాకు ఒక అక్క, ఒక చెల్లి. మాది నిరుపేద కుటుంబం. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మా అక్కని మా అమ్మమ్మ ఇంట్లో ఉంచి చదివించారు. "నాకు కనీసం సైకిలైనా ఉంటే నిన్ను బడికి తీసుకువెళ్ళేవాణ్ణి" అనేవాడు నాన్న. ఒకే గది ఉన్న ఇంట్లోనే రోజంతా ఉండలేక... నేల మీద నుంచి పాకుతూ... వీధిలో ఉన్న చెట్ల కింద కూర్చొని, వచ్చీపోయేవారిని చూస్తూ గడిపేదాన్ని. మా చెల్లెలు స్కూల్ నుంచి వచ్చేవరకూ ఎదురుచూసేదాన్ని. తను వచ్చి బడి కబుర్లు చెప్పేది. ఇలా కొన్నేళ్ళు గడిచాయి. నా తోబుట్టువులకు పెళ్ళయ్యాక అత్తవారిళ్ళకు వెళ్ళడంతో... పూర్తి ఒంటరితనంలో మునిగిపోయాను. అయితే నేను ఎన్నడూ కుంగిపోలేదు. నాకు ఏదో మంచి జరుగుతుందనే ఎప్పుడూ అనుకొనేదాన్ని. తొమ్మిదేళ్ళ క్రితం అలాంటి రోజు వచ్చింది.

**మా రాష్ట్రం నుంచి మొదటి మహిళను నేనే...**

అంగవైకల్యం ఉన్నవారికి ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ చేస్తోందని తెలుసుకొని... దరఖాస్తు చేశాను. కొన్నాళ్ళలోనే నాకు స్కూటర్ మంజూరైంది. నా సోదరి కుమారుడి సహకారంతో... మూడు రోజుల్లోనే దాన్ని నడపడం నేర్చుకున్నాను. దాంతో నాకు కొత్తగా రెక్కలొచ్చినట్టు అనిపించింది. అప్పటివరకూ ఇంటికే



పరిమితమైన నేను... ఆ స్కూటర్ మీద ఊరంతా తిరిగేదాన్ని. ఆలయాలకు, ఉత్సవాలకు వెళ్ళేదాన్ని. కొన్నిసార్లు మావాళ్ళతో దూర ప్రాంతాలకు కూడా వెళ్ళొచ్చాను. కాలం ఇలా గడుస్తూ ఉండగా... మా పొరుగున ఉన్న అబ్దుల్ బషీర్ అనే పెద్దాయన ఒక రోజు మా ఇంటికి వచ్చారు. ఆయన నాకు చిన్నప్పటినుంచీ తెలుసు. రోడ్డు ప్రమాదంలో నడుము వరకూ ఆయనకు చచ్చుబడింది. "ఈ రోజు సాయంత్రం ఒక చోటుకు వెళ్దాం వస్తావా?" అని అడిగారు. సరేనన్నాను. మా ఊరుకు నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండోర్ స్టేడియంకు నన్ను తీసుకువెళ్ళారు. అక్కడ పారా పవర్ లిఫ్టింగ్‌లో ఎంపికలు జరుగుతున్నాయి. 'వాటిని చూపించడానికి ఆయన తీసుకువచ్చారేమో?' అనుకున్నాను. నిర్వాహకులతో బషీర్ మాట్లాడారు. నా దగ్గరకు వచ్చి... "నువ్వు పవర్ లిఫ్టింగ్‌కు ప్రయత్నిస్తే బాగుంటుంది కదా!" అన్నారు. అంతకుముందు ఆ క్రీడను నేను కనీసం చూడనైనా లేదు. కానీ 'ప్రయత్నిస్తే తప్పేముంది?' అనిపించింది. మొదటి ప్రయత్నంలోనే ముప్పై కిలోలు అవలీలగా ఎత్తగలిగాను. జాతీయ పారా పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాను. కేరళ తరపున ఈ క్రీడలో క్వాలిఫై అయిన మొదటి మహిళను నేనని తెలిసినప్పుడు... ఆశ్చర్యం, ఆనందం నన్ను ముంచెత్తాయి. కేరళ పారా పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జోబీ మాథ్యూ నాతో ప్రత్యేకంగా మాట్లాడారు. "నీకు సామర్థ్యం ఉంది, కానీ శిక్షణ లేదు. జాతీయ పోటీలకు ఇంకా రెండు నెలల సమయం ఉంది. కాబట్టి శిక్షణ తీసుకో" అని చెప్పారు. మా ఊరుకు దగ్గర్లోని టౌన్‌లో చక్కటి సౌకర్యాలున్న జిమ్‌ల పేర్లను ఆయన సూచించారు. అయితే అవన్నీ పై అంతస్తుల్లోనే ఉన్నాయి. నేను పైకి ఎక్కడం కష్టం. చివరకు, ఇంట్లో జిమ్ నడుపుతున్న పుష్ప అనే మహిళా శిక్షకురాలు దొరికారు. ఆ సమయంలోనే నా గురించి తెలుసుకున్న 'ఇన్‌స్పైర్' అనే స్వచ్ఛంద సంస్థ నా ప్రయాణ ఖర్చులను స్పాన్సర్ చేసింది. నా చెల్లెలిని సాయం తీసుకొని జాతీయ పోటీల కోసం నాగపూర్ వెళ్ళాను. నేను విమానం ఎక్కడం అదే తొలిసారి.ఆ కల నెరవేర్చుకున్నా...పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నాను. కానీ ఇతర పోటీదారుల ముందు నా నైపుణ్యం సరిపోలేదు. నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దాంతో నాలో పట్టుదల పెరిగింది. మరిన్ని ఎక్కువ సౌకర్యాలున్న జిమ్‌లో చేరాను. రోజూ మెట్ల మీద పాక్కుంటూ పైకి వెళ్ళేదాన్ని. మా ట్రైనర్ మోహనన్ నా దగ్గర డబ్బులేవీ తీసుకోలేదు. అయితే "పవర్ లిఫ్టింగ్‌లో రాణించాలంటే దారుఢ్యం ఎంతో అవసరం. తగిన ప్రోటీన్ కోసం రోజూ పదో వాను గుడ్లు, చికెన్ తినాలి. తీపి పదార్థాలు, వేపుళ్ళు మానేయాలి" అంటూ సూచనలు చేశారు. ఆయన వద్దన్నవి తీసుకోలేదు, కానీ అవసరమన్నవి తీసుకొనే స్థోమత మాకు లేదు. కాబట్టి వీలైన మేరకే పాటించేదాన్ని. పూర్తిగా సిద్ధమైన దశలో... కొవిడ్ విజృంభించింది. పోటీలు వాయిదా పడ్డాయి. ఆ సమయాన్ని నేను శిక్షణ కోసం వినియోగించుకున్నాను. తరువాత... 2021లో... బెంగళూరులో జరిగిన నేషనల్స్‌లో పాల్గొని, రెండో స్థానంలో నిలిచాను. కానీ నా లక్ష్యం స్వర్ణ పతకం సాధించడం. అందుకోసం తీవ్రంగా సాధన చేశాను. 2022లో... అరవై ఒక్క కిలోల కేటగిరీలో బంగారు పతకం సాధించి నా కల నెరవేర్చుకున్నాను. పారా పవర్‌లిఫ్టింగ్‌లో ఈ ఘనత సాధించిన తొలి కేరళ మహిళగా నిలిచాను. ఒకప్పుడు ఇల్లు దాటని నాకు ఇప్పుడు సమాజంలో గుర్తింపు లభించింది. నా కథ ఏ ఒక్కరిలో స్ఫూర్తి కలిగించినా... నా జీవితం సఫలమైనట్టే. రాబోయే పోటీల్లో రాణించాలి. అంతర్జాతీయ పోటీల్లో కూడా నా ప్రతిభ కనబరచాలి. ప్రస్తుతం ఇదే నా ఆకాంక్ష."

# ఆ మందులు వాడొద్దు



వ్యాధులకు చికిత్సలో భాగంగా ఎన్నో మందులు వాడాల్సి వస్తుంది. వ్యాధి తగ్గుముఖం పట్టగానే ట్యాబ్లెట్లు వాడటం ఆపేస్తారు. కొన్నిసార్లు అవసరానికి మించి కొంటూ ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో మందులు మిగిలిపోతూ ఉంటాయి. సాధ్యమైనంత వరకు ఎక్స్‌పైరీ డేట్ చూసుకునే మందులు వాడతారు. కాకపోతే ఎప్పుడో ఓసారి చూసుకోకుండానో, ఏమీ కాదనుకునో గడువు తీరిపోయిన మందులు వేసుకుంటారు. ఇలా చేయడం చాలా సందర్భాల్లో ప్రమాదకరంగా పరిణమిస్తుంది. బుప్రొఫేన్, ఎసిటామినోఫెన్ లాంటి పెయిన్‌కిల్లర్లు, అలర్జీల నివారణకు వాడే యాంటిహిస్టమైన్స్ తేదీ అయిపోయాక వేసుకున్నప్పటికీ అంత ప్రమాదకరం కాకపోవచ్చు. డేట్ అయిపోయిన తర్వాత వాటి ప్రభావం అంతగా ఉండదు. దీంతో మరిన్ని వేసుకుంటారు. ఇలాంటి మాత్రలు ఒకసారి వేసుకుంటే అంత ఇబ్బంది కలగకపోవచ్చు కానీ, పరిమితి దాటితే మాత్రం ఆరోగ్యం మీద దుష్ప్రభావం తప్పకుండా పడుతుందని అంటున్నారు వైద్యులు. ఇక గడువు తీరిపోయిన యాంటిబయాటిక్స్, గుండె మందులు, ఇన్సులిన్, ఎపిపెన్స్ లాంటి వాటి విషయంలో మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలి. నిజానికి డేట్ అయిపోయిన తర్వాత ఆ మందులను అసలు వాడనేకూడదు. కాబట్టి, మందులు వేసుకునేటప్పుడు తప్పనిసరిగా వాటి లేబుళ్లను చదవాలి.

**యాంటిబయాటిక్స్**

నిపుణుల అభిప్రాయంలో టెట్రాసైక్లిన్ లాంటి యాంటిబయాటిక్స్‌ను డేట్ అయిపోయాక వేసుకుంటే, అవి కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. పైగా అప్పటికే ఇవి తమ సామర్థ్యం కోల్పోయి ఉంటాయి. కాబట్టి, శరీరంలో చెడు బ్యాక్టీరియాను నిర్మూలించలేవు. దీంతో వ్యాధి మరింత ముదురుతుంది. ముఖ్యంగా లిక్విడ్ (ద్రవరూప) యాంటిబయాటిక్స్ విషయంలో మరీ జాగ్రత్తగా ఉండాలని వైద్యుల సూచన. అందువల్ల యాంటిబయాటిక్స్ విషయంలో వైద్యులు చెప్పిన కోర్సు వరకే వాడాలి. అదనంగా నిల్వ ఉంచుకోకూడదు. ఇక కోర్సు పూర్తి కాకముందే యాంటి బయాటిక్స్ ఆపేశారంటే అవి ముందుముందు మీ శరీరంపై పనిచేయవు.

గుండె మందులు: గుండె సమస్యలు ఉన్నవాళ్లు డేట్ అయిపోయిన మందులు అసలే ఉంచుకోకూడదు. వాటి సామర్థ్యం కోల్పోతాయి కాబట్టి, అవి వాటికి నిర్దేశించిన పనిచేయవు.

ఇన్సులిన్: డయాబెటిస్ వ్యాధిగ్రస్తుల్లో రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించడానికి ఇన్సులిన్ అవసరమవుతుంది. అయితే, డేట్ అయిపోయిన ఇన్సులిన్ వాడకూడదు. ఒకవేళ వాడితే డయాబెటిస్ (హైపర్‌గ్లైసిమియా) సమస్య మరింత తీవ్రమవుతుంది.

ఎపిపెన్స్: ఇవి జీవితాన్ని నిలబెట్టే మందులు. అయితే, డేట్ అయిపోయాక వాడితే మాత్రం జీవితానికి ముప్పు తెచ్చిపెడతాయి.

మందుగోలీలు కూడా రోజువారీ ఆహారం లాంటివే. ఎక్కువసేపు ఉంటే ఆహారం పాచిపోయినట్టే, మాత్రలు కూడా పనిచేయకుండా పోతాయి. అందుకే, ఎక్స్‌పైర్డ్ ట్యాబ్లెట్లు, ఇతర మందులు వాడొద్దు.

**ఇతర సైడ్ ఎఫెక్ట్స్**


టాక్సిసిటీ: డేట్ అయిపోయిన యాంటిబయాటిక్స్, ఐ డ్రాప్స్, క్రీములు బ్యాక్టీరియాతో (టాక్సిన్స్) కలుషితమైపోతాయి. దీంతో ఇవి అసలు సమస్యను తగ్గించడానికి బదులు కొత్త సమస్యలకు దారితీస్తాయి.

ఇన్ఫెక్షన్: ఎక్స్‌పైర్ అయిపోయిన మందుల్లో రసాయన మార్పులు జరుగుతుంటాయి. ఇవి చర్మం మంటపెట్టడం (ఇరిటేషన్) లాంటి అలర్జీ లక్షణాలకు దారితీస్తాయి. ముఖ్యంగా క్రీములు, ఆయింట్‌మెంట్లు, ఐ డ్రాప్స్ విషయంలో దీన్ని గమనించవచ్చు.

మరో మాట: మీ మందులను చల్లగా ఉన్న పొడి ప్రదేశంలోనే నిల్వ ఉంచాలి. ఒకవేళ తడి ప్రదేశంలో ఉంచితే వాటిలో ఉండే రసాయనాలు తొందరగా విచ్ఛిన్నమైపోతాయి.

# తెల్లజుట్టుకి కెమికల్ డై వేస్తున్నారా, అవసరమే లేదు కొన్ని నూనెలతోనే నల్లగా మార్చుకోవచ్చు





చాలా మంది తెల్లజుట్టుతో బాధపడతారు. అలాంటి వారు రకరకాల హెయిర్ కలర్స్, ఇతర పద్ధతులని ఫాలో అవుతారు. కానీ, వీటి వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. అలా కాకుండా నేచురల్‌గా జుట్టుని నల్లగా కనిపించేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు.

తెల్లజుట్టుకి కెమికల్ డై వేస్తున్నారా, అవసరమే లేదు కొన్ని నూనెలతోనే నల్లగా మార్చుకోవచ్చు, ఎలా తయారుచేయాలంటే

ప్రజెంట్ జనరేషన్‌లో అన్నీ త్వరగానే వచ్చేస్తున్నాయి. అందులో తెల్ల జుట్టుకూడా. ఇదివరకటి రోజుల్లో అయితే ఎప్పుడో 40, 50 దాటిన వారికి వచ్చేవి. కానీ.. ఇప్పుడు ఎంత త్వరగా అభివృద్ధి చెందుతున్నామో.. హెల్త్, బ్యూటీ ప్రాబ్లమ్స్ కూడా అంతేత్వరగా వచ్చి చేరుతున్నాయి. అందులో తెల్లజుట్టు కూడా ఒకటి. వీటికి చాలానే కారణాలు ఉన్నాయి. ఒత్తిడి, పోషకాహార లోపం, కెమికల్ హెయిర్ ప్రోడక్ట్స్ ఎక్కువగా వాడడం, సరిలేని ఆహారం వంటివన్నీ కూడా. ఆయుర్వేదం ప్రకారం పిత్త దోషం ఎక్కువగా ఉన్నవారికి త్వరగా జుట్టు తెల్లబడుతుంది. కారణం తలపై ఎక్కువగా వేడి ఉండడమే. దీని వల్ల జుట్టు పిగ్మంటేషన్ తగ్గుతుంది. వీటిని కవర్ చేయడానికి కెమికల్ ప్రోడక్ట్స్ బదులు ఆయుర్వేదాన్ని ఫాలో అయితే జుట్టు నల్లగా మారడంతో పాటు హెల్దీగా కూడా ఉంటుందని డాక్టర్ రోహిత్ మాధవ్ సేన్(ఫౌండర్ అండ్ మాధవ్‌బాగ్) చెబుతున్నారు. అందుకోసం నాలుగు ఎఫెక్టివ్ ఇంటి చిట్కాలని కూడా సూచిస్తున్నారు.

**అవేంటంటే**

**ఉసిరి, భృంగరాజ్**

**కావాల్సిన పదార్థాలు**

2 టేబుల్ స్పూన్ల ఉసిరిపొడర్2 టేబుల్ స్పూన్ల భృంగరాజ్ పౌడర్4 టేబుల్ స్పూన్ల కొబ్బరి లేదా నువ్వుల నూనె

**తయారీ విధానం**

ఓ పాన్‌లో కొబ్బరినూనెని వేడి చేసి, ఉసిరి, భృంగరాజ్ పౌడర్స్ వేసి కలపండి. పదార్థాలు బాగా కలిసేవరకూ నూనెని 5 నుంచి 7 నిమిషాల పాటు తక్కువ మంటపై పెట్టి మరగనివ్వండి. ఈ నూనె చల్లబడనివ్వండి. తర్వాత వడకట్టండి. గోరువెచ్చగా ఉన్న నూనెని తలకి రాసి సున్నితంగా మసాజ్ చేయండి. తలకి రాసిన తర్వాత రాత్రంతా అలానే ఉంచి మరుసటి ఉదయాన్నే మైల్డ్ హెర్బల్ షాంపూతో క్లీన్ చేయండి. బెస్ట్ రిజల్ట్ కోసం వారానికి 3 సార్లు చేయండి.

**బెనిఫిట్స్**

ఉసిరిలోని విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్స్ జుట్టు త్వరగా తెల్లబడడాన్ని తగ్గిస్తాయి. భృంగరాజ్ మెలనిన్ ఉత్పత్తిని పెంచి జుట్టు కుదుళ్లని బలంగా చేస్తుంది.

**కరివేపాకుతో**

**కావాల్సిన పదార్థాలు**

10 నుంచి 15 తాజా కరివేపాకు4 టేబుల్ స్పూన్ల కొబ్బరినూనె

**తయారీ విధానం**

ఓ పాన్‌లో కొబ్బరినూనెని వేడి చేసి కరివేపాకు వేయండి. ఆకుల్లోని పోషకాలు నూనెలోకి విడుదలవుతాయి. నూనె కాస్తా రంగు మారేవరకూ మరిగించండి. ఇది చల్లారక వడకట్టండి. ఈ నూనెని తలకి అప్లై చేసి 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ చేయండి. 1 లేదా 2 గంటలు అలానే ఉంచి తర్వాత హెర్బల్ షాంపూతో క్లీన్ చేయండి. వారానికి రెండు సార్లు ఈ చిట్కాని ఫాలో అయితే మంచి రిజల్ట్స్ ఉంటాయి.

**బెనిఫిట్స్**

కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్స్, అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు కుదుళ్లని బలంగా చేస్తాయి. నల్లగా మారుస్తాయి. పైగా వీటిని వాడడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

**హెన్నా, ఇండిగో నేచురల్ హెయిర్ డై**

**కావాల్సిన పదార్థాలు**

4 టేబుల్ స్పూన్ల హెన్నా పౌడర్4 టేబుల్ స్పూన్ల ఇండిగో పౌడర్1 టేబుల్ స్పూన్ల ఉసిరి పొడి1 టేబుల్ స్పూన్ కాఫీ పొడితగినంత నీరు

**తయారీ విధానం**

హెన్నా పౌడర్‌ని గోరువెచ్చని నీటితో కలిపి మృదువైన పేస్టులా తయారు చేయండి. 4 నుంచి 6 గంటలు అలానే ఉంచండి. దీన్నంతా జుట్టుకి అప్లై చేసి 2 గంటలు అలానే ఉంచండి. తర్వాత క్లీన్ చేయండి. ఇండిగో పౌడర్‌ని కూడా గోరువెచ్చని నీటితో కలిపి చిక్కని పేస్టులా తయారుచేయండి. దీనిని కూడా జుట్టుకి అప్లై చేసి 1 నుంచి 2 గంటలు అలానే ఉంచి ప్లెయిన్ నీటితో కడగాలి. సహజంగా నల్లని జుట్టుకోసం నెలకి ఓ సారి దీనిని వాడండి.

**బెనిఫిట్స్**

హెన్నా జుట్టుని కండీషన్ చేస్తుంది. బలంగా మారుస్తుంది. ఇండిగో సహజ రంగుగా పనిచేస్తుంది. డీప్ బ్లాక్ కలర్‌ని ఇస్తుంది. దీని వల్ల కెమికల్స్ లేకుండా జుట్టు నేచురల్‌గానే నల్లగా మారుతుంది.

**నల్ల నువ్వులు, బాదం**

**కావాల్సిన పదార్థాలు**

1 టేబుల్ స్పూన్ నువ్వులు5 బాదం1 టీస్పూన తేనె

తయారీ విధానం


నల్ల నువ్వులు, బాదంలను రాత్రంతా నానబెట్టండి. మరుసటి రోజు ఉదయాన్నే వాటిని పేస్టులా మిక్సీ పట్టండి. ఈ పేస్ట్‌ని తేనెతో కలిపి ప్రతి రోజ పరగడపున తినండి.

**బెనిఫిట్స్**

నల్లనువ్వుల్లో మెలనిన్‌ని ఉత్పత్తిని ప్రోత్సహించే ఐరన్, ఖనిజాలతో నిండి ఉంటుంది. బాదం జుట్టు పెరుగుదలకి, తల ఆరోగ్యానికి అవసరమైన పోషకాలని అందిస్తుంది.

గమనిక:నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# పచ్చబొట్లతో ప్రమాదాలు



పచ్చబొట్లు ప్యాషన్‌లో భాగమైపోయాయి. నలుగురినీ ఆకట్టుకునే అందమైన పచ్చబొట్టు పొడిపించుకునేటప్పుడు దాంతో పొంచి ఉండే ప్రమాదాలను కూడా గుర్తు పెట్టుకోవాలి.

అలర్జీలు: టాటూల కోసం ఉపయోగించే సిరాతో, ప్రత్యేకించి ఎర్ర సిరాతో కొందరికి చర్మపు అలర్జీలు తలెత్తుతాయి. దాంతో పచ్చబొట్టు పొడిపించుకున్న చోట దురదలు, దద్దుర్లు ఏర్పడతాయి. అలాగే పచ్చబొట్టు పొడిపించుకున్న ప్రదేశం ఎండకు బహిర్గతం అవడం వల్ల కొందర్లో ఫొటోఅలర్జిక్ రియాక్షన్ కూడా తలెత్తుతుందిఇన్‌ఫెక్షన్లు: టాటూలు చర్మపు సహజసిద్ధ రక్షణ పొరను ఛిద్రం చేస్తాయి. పరిశుభ్రత, స్టెరిలైజేషన్‌లను పాటించకపోతే వాటితో చర్మపు ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి లాంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లతో పాటు, కొన్ని రకాల బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు సోకే అవకాశాలుంటాయి.

కెలాయిడ్ మచ్చలు: కొందర్లో కెలాయిడ్ స్కారింగ్ సమస్య ఉంటుంది. ఈ సమస్య ఉన్నవాళ్లలో టాటూ వేయించుకున్న ప్రదేశం ఉబ్బెత్తుగా, అందవిహీనంగా మారిపోతుంది. అలాగే ఎమ్మారై స్కానింగ్ సమయంలో టాటూలు ఇబ్బందికరంగా మారతాయి. ఇమేజింగ్ నాణ్యతను దెబ్బతీస్తాయి.

చర్మం పలుచన: సోరియాసిస్ లాంటి చర్మ సమస్యలున్నవాళ్లలో టాటూల వల్ల చర్మం మరింత పలుచబడి, మచ్చలు ఏర్పడతాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి


టాటూలు వేయించుకునే ముందు, వైద్యుల చేత చర్మ తత్వాన్ని పరీక్షించుకోవాలి.

నాణ్యమైన సిరా, పనిముట్లు వాడే టాటూ కళాకారులను ఎంచుకోవాలి

అనుభవమున్న, పరిజ్ఞానమున్న ఆర్టిస్టులకే ప్రాధాన్యం ఇవ్వాలి

సున్నిత చర్మం కలిగి ఉన్న వాళ్లు టాటూలకు దూరంగా ఉండడమే మేలు

# ఆరోగ్యకరం మధ్యధరా ఆహారం



ఐరోపా, ఆఫ్రికా ఖండాల మధ్య ఉన్న సముద్రమే మధ్యధరా సముద్రం. దీనికి చుట్టుపక్కల దేశాల్లో ఉండే ప్రజలు ప్రధానంగా తీసుకునే ఆహారాన్ని మధ్యధరా ఆహార విధానం (మెడిటరేనియన్ డైట్) అని పిలుస్తారు. ఈ ఆహార విధానాన్ని అనుసరించే వాళ్లు మిగిలిన వాళ్లతో పోలిస్తే ఎక్కువ ఆరోగ్యంగా ఉంటారు. ఎక్కువ కాలం జీవిస్తారు. కాబట్టి, మెడిటరేనియన్ డైట్‌ను ఆరోగ్యకరమైన ఆహారంగా పరిగణిస్తుంటారు. అంతేకాదు బరువు తగ్గడంలోనూ ఇది ముఖ్యపాత్ర పోషిస్తుందని 'ఫిజీషియన్స్ కమిటీ ఫర్ రెస్పాండిబుల్ మెడిసిన్' నేతృత్వంలో జరిగిన అధ్యయనం తెలిపింది. దీనికోసం కొంతమందిని పరిశీలనకు ఎంచుకున్నారు. వారిని రెండు వర్గాలుగా విభజించారు.

పదహారు వారాలపాటు మెడిటరేనియన్ ఆహారం, ఆ తర్వాత మరో పదహారు వారాలపాటు ఇతర ఆహారాన్ని తీసుకోవాల్సిందిగా వారికి సూచించారు. ఆ తర్వాత వారిని పరిశీలిస్తే మెడిటరేనియన్ ఆహారం తిన్న తర్వాత బరువు తగ్గినట్టు గుర్తించారు. అంతేకాదు గుండెపోటు, పక్షవాతం, మధుమేహం, ఫ్యాటీ లివర్ డిసీజ్ లాంటి వ్యాధుల నుంచి రక్షణ కూడా లభిస్తుందని తెలిపారు.


ఏముంటాయి ఇందులో?

తాజా పండ్లు, కూరగాయలు, క్వినోవా, దంపుడు బియ్యం (బ్రౌన్ రైస్), ఆలివ్ ఆయిల్, చేపలు, లెగ్యూమ్స్, పౌల్ట్రీ ఆహారం, గింజలు వంటివి మధ్యధరా ఆహారంలో ప్రధానంగా ఉంటాయి.



## భారీగా పడిపోయిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు..!

**న్యూఢిల్లీ-నవభూమి:** వరుసగా ఐదోరోజు ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయాయి. ఉదయం ట్రేడింగ్‌లో బ్యాంక్ షేర్లు 25శాతం తగ్గాయి. ప్రైవేటురంగ బ్యాంక్ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మంగళవారం ఉదయం ఇండస్‌ఇండ్ షేర్లు మధ్యాహ్నం 1.45 గంటలకు రూ.226.90 తగ్గి ఒక్కో షేరు ధర రూ.673.60 చేరి.. 52 వారాల కనిష్టానికి చేరుకుంది. అదే సమయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు రూ.227.70 తగ్గి.. ఒక్కో షేరుకు రూ.673కి చేరింది. సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోకు సంబంధించిన ప్రక్రియల అంతర్గత సమీక్ష సందర్భంగా ఖాతాల బ్యాలెన్స్‌లో కొన్ని వ్యత్యాసాలను గుర్తించినట్లు ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేర్కొంది.ముంబయికి చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించామని అంతర్గత సమీక్షలో పేర్కొంది. దాంతో బ్యాంక్ నికర విలువపై దాదాపు 2.35 శాతం ప్రతికూల ప్రభావం పడనున్నట్లు అంచనా వేసింది. ఇది రూ.1,530 కోట్ల నష్టానికి సమానం అన్నమాట. బ్యాంక్ ప్రకటన షేర్లపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలోనే షేర్లు 25శాతం వరకు పతనమయ్యాయి. ఫలితంగా బ్యాంక్ మార్కెట్ విలువ ఏకంగా రూ.14వేల కోట్లు తగ్గింది. గతేడాది డిసెంబర్ నాటికి బ్యాంక్ నికర విలువ రూ.65,102 కోట్లుగా ఉన్నది. సెప్టెంబర్ 2023లో ఆర్‌బీఐ జారీ చేసిన సూచనల మేరకు ఈ సమీక్ష జరిగింది. ఈ విషయాన్ని ఆడిటర్ పరిశలిస్తుందని.. మార్చి 2025 నాటికి నివేదిక వస్తుందని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. అయితే, ప్రతికూల ప్రభావాన్ని తట్టుకోగలమని బ్యాంక్ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు సోమవారం దాదాపు నాలుగుశాతం పడిపోయాయి.



## గుర్‌గ్రామ్‌లో లగ్జరీ ఇండ్లకు ఫుల్లు డిమాండ్.. హైదరాబాద్‌లో భారీగా తగ్గిన ఇండ్ల సేల్స్..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇన్‌పుట్ కాస్ట్ వ్యయంతోపాటు ఇండ్ల ధరలు పెరిగినా సొంతింటి కల సాకారం కోసం ముందుకు వచ్చే వారే ఎక్కువ అవుతున్నారు. 2023తో పోలిస్తే 2024లో దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల పరిధిలో ఇండ్ల విక్రయాలు 12 శాతం పెరిగి రూ.6.73 లక్షల కోట్లకు చేరుకున్నాయని రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ వెల్లడించింది. ప్రత్యేకంచి లగ్జరీ ఇండ్లకు డిమాండ్ పెరిగిందని పేర్కొంది. 2023లో రూ.6,00,143 కోట్ల విలువైన ఇండ్ల విక్రయాలు జరిగితే, 2024లో రూ.6.73 లక్షల కోట్లకు చేరుకున్నది. దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలోని గుర్‌గ్రామ్ పరిధిలో 2023లో రూ.64,314 కోట్ల ఇండ్ల విక్రయాలు జరిగితే, 2024లో రూ.1,06,739 కోట్ల విలువైన ఇండ్ల విక్రయాలు నమోదయ్యాయి.గుర్‌గ్రామ్ పరిధిలో డీఎల్‌ఎఫ్, సిగ్నేచర్ గ్లోబల్, గోద్రేజ్ ప్రాపర్టీస్, ఎం3ఎం ఇండియాతోపాటు స్మార్ట్ వరల్డ్ డెవలపర్స్, ఎలన్‌గ్రూప్, ఏటీఎస్ గ్రూప్, కృషుమి కార్పొరేషన్ తదితర సంస్థలు అత్యధికంగా ఇండ్లు విక్రయించాయి. ఓవరాల్‌గా ఢిల్లీతోపాటు దేశ రాజధాని (ఎన్‌సీఆర్) పరిధిలో 2023లో ఇండ్ల విక్రయాలు 63 శాతం వృద్ధి చెందాయి. 2023లో రూ.94,143 కోట్ల విలువైన ఇండ్ల విక్రయాలు జరిగితే, 2024లో రూ.1,53,000 కోట్లకు చేరాయని ప్రాప్‌ఈక్విటీ వెల్లడించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో సగటున ఎస్ఎఫ్‌టీ ధర రూ.12,469 పెరిగింది.ప్రాప్‌ఈక్విటీ ఫౌండర్ అండ్ సీఈఓ సమీర్ జాసుజా మాట్లాడుతూ.. 'ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో ధృడంగా మౌలిక వసతుల అభివృద్ధి, కార్పొరేట్ సంస్థల ప్రాతినిధ్యం పెరుగుదలతో పుష్కల ఉపాధి అవకాశాలు లభించడంతో ఆఫీస్ లీజింగ్‌కు ఆధిపత్యం పెరిగింది'అని చెప్పారు. ఢిల్లీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రియల్ ఎస్టేట్ రంగం మరింత పెరుగుదలకు అవకాశం ఉందన్నారు.మహారాష్ట్ర రాజధాని ముంబైలో 2023తో పోలిస్తే గతేడాది (2024)లో ఇండ్ల విక్రయాలు 13శాతం వృద్ధి చెందాయి. 2023లో రూ.1.24 లక్షల కోట్ల విలువైన ఇండ్ల విక్రయాలు జరిగితే, 2024లో రూ.1.38 లక్షల కోట్ల విలువైన ఇండ్లు అమ్ముడు పోయాయి. థాణెలో ఆరు శాతం ఇండ్ల విక్రయాలు పెరిగాయి. 2023లో రూ.53 వేల కోట్ల ఇండ్ల అమ్మకాలు జరిగితే, 2024లో రూ.56 వేల కోట్లకు చేరాయి. పుణెలో ఒకశాతం సేల్స్ పతనం అయ్యాయి. నేవీ ముంబైలో ఇండ్ల విక్రయాలు 2023తో పోలిస్తే గతేడాది 32 శాతం వృద్ధి చెందాయి. 2024లో రూ.19 వేల కోట్ల విలువైన అమ్మకాలు రికార్డయితే గతేడాది రూ.25 వేల కోట్లకు దూసుకెళ్లాయి.తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఇండ్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. 2023లో రూ.1.28 లక్షల కోట్ల విలువైన ఇండ్లు అమ్ముడైతే గతేడాది రూ.1.05లక్షల కోట్లకు పడిపోయాయి. కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో 2023తో పోలిస్తే ఇండ్ల సేల్స్ 13 శాతం వృద్ధి చెందాయి. 2023లో రూ.75 వేల కోట్ల విలువైన ఇండ్ల విక్రయాలు జరిగితే, 2024లో రూ.85,000 కోట్లకు చేరాయి. తమిళనాడు రాష్ట్ర రాజధాని చెన్నైలో ఐదు శాతం ఇండ్ల అమ్మకాలు పుంజుకున్నాయి. 2023లో రూ.19 వేల కోట్ల విక్రయాలు నమోదైతే గతేడాది రూ.20 వేల కోట్ల విలువైన ఇండ్ల సేల్స్ రికార్డయ్యాయి.

## కొనుగోలుదారులకు షాక్.. పసిడి ధర మళ్లీ పెరిగింది..! తులం పలుకుతుందంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:** పసిడి ధరలు కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. ఇటీవల వరుసగా మూడురోజుల పాటు తగ్గుతూ వచ్చిన ధరలు మంగళవారం స్వల్పంగా పెరిగాయి. దేశ రాజధానిలో తులం బంగారం ధర రూ.88,790కి చేరింది. బంగారం ధరలను పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. 24 క్యారెట్ల గోల్డ్‌పై రూ.40 పెరిగి తులానికి రూ.88,790కి పెరిగింది. ఇక 22 క్యారెట్స్ స్వర్ణం ధర సైతం రూ.40 పెరిగి రూ.80,390కి చేరింది. ఇక వెండి ధర రూ.350కి తగ్గి.. కిలో రూ.98,900కి చేరుకుంది. గ్లోబల్ మార్కెట్‌లో ఏప్రిల్ డెలివరీకి సంబంధించిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ఔన్స్‌కు 19.30 డాలర్లు పెరిగి 2,918.70కి చేరుకుంది.స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 0.82శాతం పెరిగి.. 2,912.43 డాలరకు చేరింది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ అనలిస్ట్ వైస్ ప్రెసిడెంట్ జతిన్ త్రివేది మాట్లాడుతూ.. డాలర్ ఇండెక్స్ బలహీనపడడంతో బంగారం ధరలు పెరిగాయన్నారు. యూఎస్‌లో సుంకాల ఆందోళనలు ఆర్థిక అనిశ్చితిని సూచిస్తున్నాయన్నారు. దాంతో సురక్షితమైన పెట్టుబడికావడంతో బంగారం కొనుగోళ్లు బలంగా ఉన్నాయన్నారు. ఈటీఎఫ్ ఇన్‌ఫ్లోలు బుల్లిష్ సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. ఆసియా మార్కెట్‌లో కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్ ఔన్స్‌కు 1.44శాతం పెరిగాయి.హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ కమోడిటీ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ మాట్లా డుతూ.. బులియన్ మార్కెట్ పెట్టుబడిదారులు ట్రంప్ సుంకాలను నిశితంగా పరిశీలిస్తున్నారన్నారు. సమీప భవిష్యత్‌లో సుంకాల యుద్ధం ఎలాంటి రూపాన్ని తీసుకుంటుందో అంచనా వేసేందుకు పెట్టుబడిదారులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.80,200 ఉండగా.. 24 క్యారెట్స్ పసిడి రూ.87,490 పలుకుతు న్నది. ముంబయిలో 22 క్యారెట్స్ పుత్తడి రూ.80,200 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.87,490కి చేరింది. తెలంగాణలోని హైదరాబాద్‌తో పాటు ఏపీలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక వెండి ధర కిలోకు రూ.1,07,000 పలుకుతున్నది.

## సమీక్షకు స్పందించిన వారిలో 53% మంది దినచర్యలో స్థిరమైన నిద్ర వేళ లేకుండా నిద్ర సంబంధిత రుగ్మతలను ఎదుర్కొంటున్నారు

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ నిద్ర దినోత్సవానికి ముందస్తుగా, 10 నగరాల్లోని భారతీయ నివాసాల్లో నిద్రకు సంబంధించిన దినచర్య అలవాట్లను అర్థం చేసుకునేందుకు YouGov Amazon Alexa% నిర్వహించిన ఒక సమీక్షకు సంబంధించిన అంశాలను విడుదల చేశాయి. స్థిరమైన నిద్ర వేళల్ని దినచర్యలో భాగంగా అనుసరించనప్పుడు తాము నిద్ర సంబంధిత సమస్యలను ఎదుర్కొన్నామని సమీక్షకు స్పందించిన వారిలో 53% మంది తెలియజేశారని సర్వే సూచిస్తోంది. పెద్దలు నిద్ర వేళకు సంబంధించిన దినచర్యలను చురుకుగా అనుసరిస్తారని అధ్యయనం మరింత అంచనా వేస్తుంది - సమీక్షకు స్పందించిన వారిలో 54% మంది సాధారణ నిద్ర దినచర్యను అనుసరించినప్పుడు నిద్రలో గణనీయమైన మెరుగుదలను చూశారు.

సమీక్షకు స్పందించిన వారిలో 52% మంది స్థిరమైన నిద్రవేళను, నిద్రకు ముందు కొన్ని అలవాట్లను అనుసరిస్తున్నారు. సమీక్షకు స్పందించిన వారిలో 86% మంది నిత్యం రాత్రి 8 గంటల నుంచి తమ నిద్రవేళ దినచర్యను ప్రారంభిస్తుండగా, వీరిలో 53% మంది రాత్రి 10.30 అనంతరం నిద్రకు ఉపక్రమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సమీక్షకు స్పందించిన వారిలో తమ దిన చర్యలలో కీలక భాగంగా వీడియో కంటెంట్ చూడటం (63%), కుటుంబం, స్నేహితులతో కలిసి కాలం వెళ్లదీయడం (59%), పాడ్‌కాస్ట్‌లు, సంగీతం లేదా ఆడియో బుక్‌లను ఆలకించడం (58%) మరియు సోషల్ మీడియా యాప్‌ల స్క్రోలింగ్ (57%) ఉన్నాయి. జంటలు మాత్రమే ఉన్న కుటుంబాలు తమ నిద్రవేళ దినచర్యలో భాగంగా ఈ కార్యకలాపాలను అనుసరిస్తుండగా, అన్ని ఇతర గృహ రకాలలోలి ఇదే తరహా విధానాన్ని ఎక్కువగా అనుసరిస్తున్నారు.


సమీక్షకు స్పందించిన ప్రతి ఇద్దరిలో ఒకరు తమ నిద్ర దినచర్యలను నిర్ణయించుకునేందుకు వాయిస్ అసిస్టెంట్‌లను ఉపయోగిస్తారు- 25-34 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారితో పోలిస్తే 35-45 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తులు వాయిస్ అసిస్టెంట్‌లను వినియోగిస్తున్నారు. "నిద్ర దినచర్యలు ప్రజాదరణ పొందుతున్నాయి. గమనించదగ్గ విషయం ఏమిటంటే స్మార్ట్ టెక్నాలజీలు, ముఖ్యంగా %Alexa% వంటి వాయిస్ అసిస్టెంట్లు, ప్రజలు తమ నిద్రవేళ దినచర్యలను అనుసరించడంలో సహాయపడటంలో విలువైన సహాయంగా మారుతున్నాయి. నిద్రవేళకు ముందు హ్యాండ్‌హెల్డ్ స్క్రీన్ పరికరాలకు ఆచరణాత్మక ప్రత్యామ్నాయాలుగా వ్యక్తిగతీకరించిన వాయిస్ AI%ఎక్స్‌పీరియన్స్‌లు అందుబాటులోకి వస్తున్నాయి. ధ్యానానికి సంబంధించిన సెషన్‌ను ప్లే చేయడం లేదా విశ్రాంతిని అందించే శబ్దాలు ఆలకించడం, ఆడియోబుక్‌లు లేదా సంగీతాన్ని వినడం, రిమైండర్‌లు, అలారాలను సెట్ చేయడం లేదా గది నిద్ర వాతావరణాన్ని సర్దుబాటు చేయడానికి స్మార్ట్ పరికరాలను నియంత్రించడం వంటివి అయినా, ప్రజలు తమ నిద్రవేళ దినచర్యలలో భాగంగా %ూశ్రీవఞు%ను వినియోగించేందుకు వినూత్న మార్గాలను కనుగొంటున్నారు. అదే విధంగా, %ూశ్రీవఞు% వినియోగదారులు %Alexa% యాప్ ద్వారా తమ నిద్రవేళ దినచర్యను సులభంగా సెటప్ చేసుకోవచ్చు. దానిని వారి నిర్దిష్ట అవసరాలు, ప్రాధాన్యతలకు అనుకూలీకరించవచ్చు" అని %Alexa India% కంట్రీ మేనేజర్ టీనా సిదానా వివరించారు.

జంటలు మరియు పిల్లలు ఉన్న కుటుంబాలు గృహ రకాల కంటే నిద్ర దినచర్యలను సెటప్ చేయడానికి వాయిస్ అసిస్టెంట్‌లను ఉపయోగిస్తారుజంటలు, పిల్లలు ఉన్న కుటుంబాలు రొటీన్‌లను అనుసరించేందుకు వాయిస్ అసిస్టెంట్ల సహాయం తీసుకోవడంలో ఉన్నత స్థానంలో ఉండగా, అనంతరం ఇతర గృహ రకాలులి ఉన్నాయి. సమీక్షకు స్పందించిన ప్రతి ఒక్కరూ సంగీతం, పాడ్‌కాస్ట్‌లు, ధ్యాన ప్లే లిస్ట్, పరిసర శబ్దాలు, సినిమాలు మరియు ఆడియో బుక్‌లను వినేందుకు స్మార్ట్ పరికరాల్లో వాయిస్ అసిస్టెంట్ల సహాయం తీసుకుంటారు. దాదాపు 23% మంది రిమైండర్‌లు, అలారాలను సెటప్ చేయడానికి వాయిస్ అసిస్టెంట్‌లను ఉపయోగిస్తారు మరియు 22% మంది బెడ్‌రూమ్ లేదా బేబీ రూమ్‌లో స్మార్ట్ లైట్లు, ఆటోమేటెడ్ కర్టెన్లు, స్మార్ట్ ఏసీలు మొదలైన స్మార్ట్ గృహోపకరణాలను నియంత్రించడానికి దీనిని ఉపయోగిస్తారు.ధ్యాన ప్లే లిస్టులను ఆలకించడం, నిద్రకు ముందస్తుగా పుస్తక పఠనం పెద్దలలో ఆసక్తి పెరుగుతుంది.సమీక్షకు స్పందించిన వారిలో ధ్యానం, పుస్తక పఠనం సహాయంతో విశ్రాంతి తీసుకోవడం ప్రస్తుతం నిద్రవేళకు ముందు నిమగ్నమయ్యే కార్యకలాపాలలో తక్కువ స్థానంలో ఉంది (27%), సర్వే ప్రకారం సమీక్షకు స్పందించిన వారిలో 50% కన్నా ఎక్కువ మంది భవిష్యత్తులో వెల్‌నెస్ కార్యకలాపాలను వారి నిద్రవేళ దినచర్యలో భాగంగా చేర్చుకుంటామని ఆసక్తిని వ్యక్తం చేశారు.

వీటిలో ధ్యానం, జర్నలింగ్, నడకలు వంటి తేలికపాటి వ్యాయామాలు, చర్మ సంరక్షణ దినచర్యను అనుసరించడం వంటివి ఉన్నాయి. పిల్లలు ఉన్న మరియు లేని జంటలు తమ దినచర్యలో భాగంగా ధ్యానం, జర్నలింగ్‌ను జోడించడంలో ఎక్కువ ఆసక్తిని (32%) చూపించారు.ఆసక్తికరంగా, ప్రస్తుతం దాదాపు 21% మంది నిద్రవేళకు ముందు తినడం, అల్పాహారం తీసుకోవడానికి ఇష్టపడతారు. ఈ అలవాటు సమీక్షకు స్పందించిన వారిలో ఆసక్తిని పెంచుతోంది. అదే విధంగా, 34% మంది నిద్రవేళకు ముందు విశ్రాంతి పానీయం లేదా చిరుతిండిని కోరుకుంటున్నారు.

## మ్యూచువల్ ఫండ్స్‌ను ఆదరిస్తున్న మహిళా ఇన్వెస్టర్లు

### ఫోన్‌పే వెల్త్ వెల్లడిస్తున్న ముఖ్యమైన గణాంకాలు




**న్యూఢిల్లీ-నవభూమి:** యావరేజ్ లంప్సమ్ ఇన్వెస్ట్‌మెంట్‌లో కూడా పురుషుల కంటే మహిళలు సుమారు 45% ఎక్కువగా పెట్టుబడి పెడుతున్నారు.సుమారుగా 72% మంది మహిళా ఇన్వెస్టర్లు B30 (బియాండ్ టాప్ 30) నగరాల నుండే ఉన్నారు. ఇది పెరుగుతున్న ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌ను సూచి స్తుంది.ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఫోన్‌పే వెల్త్ తన ప్లాట్‌ఫామ్‌లోని మ్యూచువల్ ఫండ్స్‌లో క్రమంగా పెరుగుతున్న మహిళల భాగస్వా మ్యాన్ని వివరిస్తోంది. పెట్టుబడులపై వారికి ఉన్న నిబద్ధతను, వారు కంట్రిబ్యూట్ చేస్తున్న మొత్తాలను హైలెట్ చేస్తోంది. 2024 జనవరి 1 నుండి 2024 డిసెంబర్ 31 దాకా 1 లక్ష మంది మహిళా ఇన్వెస్టర్ల పెట్టుబడి తీరును ఫోన్‌పే వెల్త్ అనలైజ్ చేసింది. మహిళలు తమ ఆర్థిక భద్రత కోసం వ్యూహాత్మకంగా, గణనీయమైన స్థాయిలో పెట్టుబడులు పెడుతున్నారని ఈ డేటా వెల్లడిస్తోంది.పైన పేర్కొన్న కాలానికి సంబంధించిన డేటా ప్రకారం, మహిళా ఇన్వెస్టర్ల సగటు సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ కంట్రిబ్యూషన్, పురుషుల కంటే సుమారు 22% ఎక్కువగా ఉంది. అలాగే వారి సగటు లంప్సమ్ ఇన్వెస్ట్‌మెంట్, పురుషుల కంటే సుమారు 45% అధికంగా ఉంది. ఫైనాన్షియల్ మార్కెట్లలో రిస్క్ తీసుకుకోవ డానికి సంబం ధించి మహిళలు విభిన్నంగా ఆలోచిస్తున్నారు అనే విషయాన్ని ఈ డేటా చెబుతోంది."మహిళా ఇన్వెస్టర్ల వైపు నుండి పెరుగుతున్న భాగస్వామ్యాన్ని, ఫైనాన్షియల్ మార్కెట్లలో వారు ఎదుగుతున్న తీరును మేము గమనించాము. ఇది హర్షించదగిన విషయం" అని %Share.Market% (ఫోన్‌పే వెల్త్) ఇన్వెస్ట్‌మెంట్ ప్రోడక్ట్స్ హెడ్, నీలేష్ - నాయక్ చెప్పారు. "మహిళా ఇన్వెస్టర్లు కేవలం మార్కెట్లలో పాల్గొనడం మాత్రమే కాకుండా, యాక్టివ్‌గా పెట్టుబడి పెడుతున్నారని మా డేటా చెబుతోంది. ఈ రోజుల్లో మహిళలు ఆర్థికంగా చైతన్యవంతంగా, స్వతంత్రంగా ఉంటున్నారని మేము భావిస్తున్నాం. అంతే కాకుండా, వారు తమ పోర్ట్‌ఫోలియోలను డైవర్సిఫై చేసుకుంటూ, లాంగ్-టర్మ్ దృష్టితో ఇన్వెస్ట్ చేస్తున్నారు. మహిళలు ఆర్థికంగా సంప్రదాయవాదులుగా ఉంటారనే అభిప్రాయం ఇక గతానికి మాత్రమే వర్తిస్తుంది" అని నాయక్ విశ్లేషించారు.2024 జనవరి 1 నుండి 2024 డిసెంబర్ 31 వరకు ఫోన్‌పే వెల్త్ మ్యూచువల్ ఫండ్స్‌లో 1,00,000 మంది మహిళా ఇన్వెస్టర్లపై జరిపి సర్వేలో ముఖ్యమైన వివరాలు:90% మహిళా ఇన్వెస్టర్లు, లాంగ్-టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్రాధాన్యం ఇస్తూ, క్రమశిక్షణతో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌లను ప్రారంభిస్తున్నారు.మహిళా ఇన్వెస్టర్ల సగటు SIP ట్రాన్సాక్షన్ విలువ?1300. ఇది పురుషుల కంటే సుమారు 22% ఎక్కువ.

## దుబాయ్‌లో బంగారం ధర ఎందుకు చీప్..?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇటీవల దుబాయ్ నుంచి అక్రమంగా గోల్డ్ స్మగ్లింగ్ చేస్తూ.. బెంగళూరు విమానాశ్రయంలో కన్నడ నటి రన్యారావును అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆమె కిలోల కొద్దీ గోల్డ్‌ను భారత్‌కు తీసుకొచ్చింది. అయితే.. దుబాయ్‌లో బంగారం ధరలు తక్కువకు లభిస్తాయన్న సంగతి తెలిసిందే. మరి టాక్స్ లేకుండా అక్కడి నుంచి మన దేశానికి ఎంత గోల్డ్ తీసుకురావొచ్చనేది తెలుసుకుం దాం.దుబాయ్ బంగారం ధరలు .. భారతీయులకు బంగారం అంటే అమితాసక్తి ఉంటుంది. ముఖ్యంగా భారతీయ మహిళలు గోల్డ్ జువెల్లరీ కొనుగోలు చేసి ధరించేందుకు ఇష్టపడుతుంటారు. పండగలు, శుభకార్యాలు, ప్రత్యేక సందర్భాల్లో అయితే కచ్చితంగా నగలు ఉండాల్సిందే. మన దేశంలో అంత డిమాండ్ ఉంటుంది. మన సంస్కృతి, సంప్రదాయాలతో అంతలా ముడిపడి ఉందని చెప్పొచ్చు. భారత్‌లో ప్రస్తుతం గోల్డ్ రేట్లు గరిష్ట స్థాయిల్లో ఉన్నాయి. హైదరాబాద్‌లోనే చూస్తే.. 22 క్యారెట్స్ గోల్డ్ రేటు ప్రస్తుతం తులం రూ. 80,500 వద్ద ఉంది. ఇదే 24 క్యారెట్ల బంగారం ధర చూస్తే రూ. 87,820 వద్ద ఉంది. దీనిని కొనుగోలు చేసినప్పుడు.. ఆభరణాలకైతే తరుగు ఛార్జీలు, జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు వంటివి పడతాయి. ఇక 24 క్యారెట్స్ ప్యూర్ గోల్డ్ కొనుగోలు చేస్తే.. జీఎస్టీ 3 శాతం చెల్లించాల్సిందే. అంటే ఈ ధర పైనచెప్పిన దాని కంటే ఎక్కువే ఉంటుంది.ఇక ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. కొద్ది రోజుల కిందట దుబాయ్ నుంచి కోట్లల్లో విలువచేసే.. 14 కిలోలకుపైగా బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ కన్నడ నటి రన్యా రావు పట్టుబడిన సంగతి తెలిసిందే. బెంగళూరు విమానాశ్రయంలో ఆమెను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలోనే దుబాయ్ బంగారం ధరల గురించి చర్చ మొదలైంది.ప్రపంచ దేశాల్లో చూస్తే దుబాయ్‌లో అత్యంత స్వచ్ఛమైన బంగారం లభిస్తుందన్న వాదన ఉంది. ఇంకా.. అక్కడ బంగారం కొనుగోలు చేస్తే అదనంగా ఎలాంటి పన్నులు ఉండవు. భారత్‌లో విధించేలా దిగుమతి సుంకాలు కూడా ఉండవు. ఇంకా అక్కడ విరివిగా బంగారం లభిస్తుండటం వల్ల విక్రయాల సమయాల్లో పసిడి వర్తకుల పోటీ వల్ల కూడా ప్రత్యేక ఆఫర్లు ఉంటాయి. దీంతో.. భారత్ కంటే చౌక ధరల్లోనే అందుబాటులో ఉంటుంది. అందుకే.. చాలా మంది దుబాయ్ నుంచి సక్రమంగానో, అక్రమంగానో బంగారం పట్టుకొస్తుంటారు. దొరికితే దొంగ.. దొరక్కపోతే దర్జాగా ఉండొచ్చని ఇలా చేస్తారు. మరి అసలు దుబాయ్‌లో గోల్డ్ రేట్లు ఎలా ఉంటాయి.. అక్కడి నుంచి టాక్సలతో.. టాక్సలు లేకుండా ఎంత గోల్డ్ తెచ్చుకోవచ్చో తెలుసుకుందాం.

విదేశాల నుంచి భారత్‌కు గోల్డ్ దిగుమతి చేసుకుంటే దిగుమతి సుంకం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఇది 6 శాతంగా ఉంది. చాలా మంది దీనిని తప్పించుకునేందుకు అక్రమంగా తరలిస్తుంటారు. దుబాయ్ నగరంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఇప్పుడు 350.50 %ూజుణ (ఖాూజు% కరెన్సీ) గా ఉంది. ఇదే భారత కరెన్సీలో చూస్తే రూ. 82 వేలకుపైగా ఉంది. అయితే భారత్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 24 క్యారెట్లపై ప్రస్తుతం రూ. 87 వేలకుపైగా ఉండగా.. జీఎస్టీ కలుపుకొని రూ. 90 వేలకుపైగానే చెల్లించాల్సి వస్తుంది.

**దుబాయ్ నుంచి ఎంత గోల్డ్ తీసుకురావొచ్చు?**

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ప్రకారం.. దుబాయ్‌లో 6 నెలలకుపైగా ఉండి.. కస్టమ్స్ డ్యూటీ చెల్లించిన వారు తమ బ్యాగేజీలో కేజీ వరకు గోల్డ్ తీసుకురావొచ్చని తెలుస్తోంది. అయితే ఈ పరిమితి దాటి బంగారం తీసుకురావాలంటే.. దానిని డ్యూటబుల్ గోల్డ్ (సుంకం చెల్లించిన బంగారం) అని నిరూపించి.. చట్టబద్ధత కోసం రెడ్ ఛానెల్‌లోకి ప్రవేశించాల్సి ఉంటుంది.

**కస్టమ్స్ డ్యూటీ లేకుండా ఎంత గోల్డ్ తేవొచ్చు?**

అయితే కస్టమ్స్ సుంకం చెల్లించకుండా కూడా కొంత బంగారం తెచ్చే అవకాశం ఉంది. ఇక్కడ పురుషులు, మహిళలు, పిల్లలకు కొన్ని పరిమితులు ఉన్నాయి.


ఒక పురుషుడు ధర రూ. 50 వేలకు మించని.. 20 గ్రాముల వరకు బంగారాన్ని దుబాయ్ నుంచి తీసుకురావొచ్చు. ఇది గోల్డ్ బార్లు, గోల్డ్ కాయిన్ల రూపంలో ఉండాలి. ఇక్కడ టాక్స్ చెల్లించనవసరం లేదు.

మహిళ అయితే రూ. లక్ష మించని గరిష్టంగా 40 గ్రాముల వరకు గోల్డ్ తీసుకురావొచ్చు. ఇది జువెల్లరీ, బార్లు, కాయిన్ల రూపంలో ఉండొచ్చు. ఇది వ్యక్తిగత వినియోగం కోసమై ఉండాలి.

ఇక 15 ఏళ్లలోపు పిల్లల విషయానికి వస్తే.. 40 గ్రాములకు మించకుండా గోల్డ్ తీసుకురావొచ్చు. టాక్సులేకుండానే ఇక్కడ నగలు, గిఫ్ట్ రూపంలో తెచ్చుకోవచ్చు.

అయితే ఇక్కడ కస్టమ్స్ అఫీషియల్స్ వెరిఫికేషన్ సమయంలో.. మీరు బంగారం కొనుగోలుకు సంబంధించి పూర్తి వివరాలు చూపించాల్సి ఉంటుంది. పిల్లలకు అయితే.. వారి తల్లిదండ్రులు లేదా గార్డియెన్లతో సంబంధం గురించిన గుర్తింపు కార్డు ఉండాలి.

## గోల్డ్ బాండ్లపై కళ్లుచెదిరే రిటర్న్స్.. లక్షపై ఇంత లాభమా అప్పుడు గ్రాముకు రూ. 4,260.. ఇప్పుడు?





**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారంపై ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టేందుకు.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం 2015లో సావరిన్ గోల్డ్ బాండ్ పథకం తెచ్చింది. ఇక్కడ కనీసం గ్రాము నుంచి గోల్డ్ కొనుగోలు చేయొచ్చు. ఒక గ్రామును ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. భౌతికంగా బంగారం కొనుగోళ్లను తగ్గించాలన్న లక్ష్యంతో.. ఇన్వెస్టర్లకు మెరుగైన రిటర్న్స్ వస్తాయన్న ఉద్దేశంతో దీనిని తీసుకొచ్చింది. దీంతో అనతి కాలంలో మంచి ఆదరణ లభించింది. ఇక్కడ ముందుగా బంగారం ధర గ్రాముకు ఇంత చొప్పున అని ప్రకటిస్తారు. దీనినే ఇష్యూ ప్రైస్ అంటారు. సబ్‌స్క్రిప్షన్ తేదీల్ని ప్రకటిస్తారు. ఆ సమయంలో బాండ్లు కొనుగోలు చేయాలి. ఇక్కడ సబ్‌స్క్రిప్షన్ తేదీకి 3 రోజుల ముందటి సగటు ధరను పరిగణనలోకి తీసుకుంటారు.ఇక వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు ) గరిష్టంగా 4 కిలోల వరకు గోల్డ్ బాండ్లు కొనుగోలు చేయొచ్చు. ట్రస్టులు వంటివైతే 20 కిలోల వరకు కొనుగోలు చేసేందుకు ఛాన్స్ ఉంటుంది. ఇక గోల్డ్ బాండ్ల కాల పరిమితి 8 సంవత్సరాలుగా ఉంది. అయితే కావాలనుకుంటే ఐదేళ్ల తర్వాత ముందస్తుగా ఉపసంహరించుకోవచ్చు. ఇక్కడ బంగారం ధర పెరిగినదానికి అనుగుణంగా మీకు రిటర్న్స్ వస్తాయి. ఇంకా కేంద్ర ప్రభుత్వం వడ్డీ కూడా చెల్లిస్తుంది.కేంద్ర ప్రభుత్వం తరపున రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. గోల్డ్ బాండ్లు జారీ చేస్తుంది.ఈ క్రమంలోనే తాజాగా 2019-20 సిరీస్ %శ% కు సంబంధించి.. గోల్డ్ బాండ్ ప్రీమెచ్యూర్ రిడెంప్షన్ ప్రైస్‌ను ప్రకటించింది. రిడెంప్షన్ ధర ఏకంగా రూ. 8,596 అని వెల్లడించింది. ఇవాళ్టితోనే (మార్చి 11) ఐదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ధర ప్రకటించింది. దీనికి ముందు మూడు రోజుల (శని,ఆదివారాలు మినహా) సగటు ధర (మార్చి 6,7,10) ఆధారంగా దీనిని నిర్ణయించింది ఇండియన్ బులియన్ జువెల్లర్స్ అసోసియేషన్ అయితే అప్పట్లో అంటే ఐదేళ్ల కిందటి ఇష్యూ ధర చూస్తే కేవలం రూ. 4,260 గానే ఉంది. ఇప్పుడు ఇన్వెస్ట్‌మెంట్‌పై రిటర్న్స్ ఎలా ఉన్నాయో లెక్కిద్దాం. సబ్‌స్క్రిప్షన్ సమయంలో రూ. లక్ష పెట్టుబడి పెట్టినట్లయితే రూ. 4,260 ఇష్యూ ధర దగ్గర 23.47 గ్రాములు కొనుగోలు చేయొచ్చు. ఇక ఇప్పటి ధర రూ. 8,596 చొప్పున చూస్తే రూ. 2,01,784.03 అయింది. అంటే ఇక్కడ లక్ష పెట్టుబడిపై అదనంగా మరో రూ. 1.01 లక్షల లాభం వచ్చింది. ఇంకా దీనిపై 2.50 శాతం వడ్డీ రేటు చొప్పున వస్తుంది. ప్రతి 6 నెలలకు ఓసారి ఇది వారి అకౌంట్లోనే పడుతుంది. ఈ లెక్కన లక్షపై మరో లక్ష కంటే ఎక్కువే లాభం వచ్చిందన్నమాట. అయితే.. గోల్డ్ బాండ్లను విక్రయించే సమయంలో సంవత్సరం దాటింది కాబట్టి లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ పడుతుంది. ఇది ప్రస్తుతం 12.5 శాతంగా ఉంది. అదే ఏడాదిలోపే విక్రయిస్తే షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ పడుతుంది.అయితే.. కేంద్రం ఇటీవల గోల్డ్ బాండ్ల కొత్త ట్రాంచీల్ని జారీ చేయట్లేదు. బడ్జెట్లోనూ పెద్దగా కేటాయింపులు జరపలేదు. దీనిని దాదాపు నిలిపివేసినట్లుగా తెలుస్తోంది. ఇటీవల బడ్జెట్ అనంతరం మీడియా సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ కార్యదర్శి కూడా దీనిపై స్పందించారు. దీని వల్ల ప్రభుత్వానికి రుణాలు పెరిగిపోతున్నాయని.. భారం పడుతుందని.. దాదాపు మూసివేసినట్లేనని బదులిచ్చారు. అయితే గతంలో జారీ చేసిన బాండ్లకు సంబంధించి.. చెల్లింపుల్ని మాత్రం చేస్తున్నారు.

## రియల్ మనీ గేమింగ్ కంపెనీలకు ప్రవర్తనా నియమావళి



**న్యూఢిల్లీ-నవభూమి:** రియల్ మనీ గేమింగ్ (ఆర్ఎంజీ) కంపెనీలకు ప్రవర్తనా నియమావళిని

**న్యూఢిల్లీ-నవభూమి:**నిర్దేశించేందుకు దోహదపడే ఒప్పందంపై ఆ కంపెనీలకు ప్రాతినిథ్యం వహించే ఏఐజీఎఫ్, ఈజీఎఫ్, ఎఫ్ఐఎఫ్ఎస్ సంతకాలు చేశాయి. యూజర్ల భద్రతకు, బాధ్యతాయుతమైన గేమింగ్ విధానాలకు ఈ చర్య దోహదపడుతుంది. ఇందులో భాగంగా ఈ సంస్థల భాగస్వా మ్యంలోని కంపెనీలు కేవైసీ పరిశీలన, ఆన్‌లైన్‌పై గడిపే కాలపరిమితి నియంత్రణకు చర్యలు తీసుకుంటాయి. ఇది 50 కోట్ల మంది పైగా ఆన్‌లైన్ గేమర్ల ప్రయోజనాలు పరిరక్షిస్తుందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనలు 2023 ఏప్రిల్‌లోనే రూపొందించినప్పటికీ వాటిని ఇంకా అమలు చేయలేదు. ఇదిలా ఉండగా ఈ సంస్థల భాగస్వామ్య కంపెనీల్లో డ్రీమ్ 11, మై 11 సర్కిల్, ఖేలో ఫ్యాంటసీ లైవ్, ఎస్‌జీ11 ఫ్యాంటసీ, విం‌జో, గేమ్స్ 24గీ7, జంగ్లీ గేమ్స్ ఉన్నాయి.రియల్ మనీ గేమ్స్‌ను గతంలో నిషేధించిన తమిళనాడు తాజాగా వాటికి కఠిన నిబంధనలు రూపొందించింది. వీటి ప్రకారం ఈ వేదికలపై మైనర్లు ఆడడాన్ని నిషేధించింది. గేమర్లకు వ్యయ నియంత్రణలు విధించింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బ్లాంక్ అవర్‌గా ప్రకటించింది. దీని వల్ల ఈ మధ్య కాలంలో ఎవరూ లాగిన్ అయ్యే అవకాశం కూడా ఉండదు.





## సగం మందికి కంటి నిండా నిద్ర కరవు!

**న్యూఢిల్లీ-నవభూమి:** గాఢంగా నిద్రపడితే చాలు.. చాలా రోగాలు దరి చేరవు. రోజుకు ఎనిమిది గంటల పాటు ఎలాంటి అంతరాయాలు లేకుండా నిద్ర ఉండాలని చాలా మంది ఆశిస్తారు. అయితే దేశంలో 59% మందికి ఆ అదృష్టం లేదు. అంతరాయాలు లేని ఆరు గంటల నిద్ర వారికి కరవయింది. ఈ నెల 14న జరిపే 'ప్రపంచ నిద్ర దినం' సందర్భంగా లోకల్ సర్కిల్ సంస్థ దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో భాగంగా 343 జిల్లాల్లోని 40వేల మంది అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 61$\%$ మంది పురుషులు, 59$\%$ మంది మహిళలు ఉన్నారు. సర్వే ప్రకారం.. 39$\%$ మంది 6-8గంటల పాటు నిద్ర పోతున్నారు. మరో 39 శాతం మంది 4-6 గంటల పాటు పడుకుంటున్నారు.కేవలం 2% మంది మాత్రమే 8-10 గంటలపాటు నిద్రపోతున్నారు. 20$\%$ మంది నాలుగు గంటల కన్నా తక్కువ సమయంపాటే పడకుంటున్నారు. మొత్తంగా 59$\%$ మందికి ఆటంకాలు లేని ఆరు గంటల నిద్ర కరవయిందని తేలింది. ఆలస్యంగా నిద్రపోవడం, త్వరగా లేవాల్సి రావడం, దోమల బెడద, సెల్‌ఫోన్‌లు, బయట శబ్దాలు, చిన్న పిల్లల అల్లరి తదితర కారణాల వల్ల సక్రమంగా నిద్ర పట్టడం లేదని పలువురు తెలిపారు. నిద్రలేమి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని లోకల్ సర్కిల్స్ వ్యవస్థాపకుడు సచిన్ తపారియా చెప్పారు. నిద్రలేని సమస్య భారత్‌లోనే అధికంగా ఉందని అన్నారు.

## నాడు ఔరంగజేబుపై పొగడ్తలు.. నేడు శంభాజీ మహరాజ్‌కు నివాళులు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇటీవల మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్‌ను పొగడ్తల్లో ముంచెత్తి అసెంబ్లీ నుంచి సస్పెన్షన్‌కు గురైన సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ ఆసిం అజ్మీ .. ఇవాళ ఛత్రపతి శంభాజీ మహరాజ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులు అర్పించారు. అంతేగాక శంభాజీ మహరాజ్‌ను పరాక్రమవం తుడైన యుద్ధవీరుడని అబూ అజ్మీ అభివర్ణించారు.ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడైన శంభాజీ మహరాజ్.. పోర్చుగీసులు, మొఘలులకు వ్యతిరేకంగా సైన్యాలను ముందుకు నడిపించారు. చివరికి శత్రువులకు చిక్కి సంగమేశ్వర్ దగ్గర హత్యకు గురయ్యారు. ఆయనను చిత్రహింసలు పెట్టి హత్య చేశారు. 'సామ్రాజ్యానికి రెండో ఛత్రపతి, పరాక్రమవం తుడైన యుద్ధ వీరుడు, ధర్మవీర్ శంభాజీ మహరాజ్‌కు నా ఘన నివాళులు.' అని అబూ అజ్మీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు.ఇటీవల అబూ అజ్మీ.. ఔరంగజేబుపై ప్రశంసలు కురిపించాడు. దానిపై మహారాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వెల్లువెత్తింది. మహా సర్కారు కూడా ఆయనపై మండిపడింది. మార్చి 26న బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఆయనను సస్పెండ్ చేసింది.

## నదులు, సరస్సుల దగ్గర సబ్బులపై నిషేధం..!



**ప్రయాగ్‌రాజ్-నవభూమి:** నదులు సరస్సులు ఇతర నీటి వనరుల దగ్గర కాలుష్యాన్ని నివారించేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా నీటి వనరులకు 500 మీటర్ల పరిధిలో సబ్బులు షాంపుల విక్రయాలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర పర్యావరణ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ కండ్రే ఆదేశాలు జారీ చేశారు. అధికారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ..'యూజ్ అండ్ త్రో సంస్కృతి' ప్రబలంగా ఉందన్నారు.దేవాలయాల సమీపంలోని నదులను సందర్శించే భక్తులు స్నానాలు ఆచరిస్తారని, షాంపూ ప్యాకెట్లు, వాడేసిన సబ్బులను నీటి వనరుల వద్ద వదిలేస్తారని చెప్పారు. ఆధ్యాత్మిక ప్రాంతాల్లోని నదులు, సరస్సులు, ఇతర నీటి వనరులకు 500 మీటర్ల పరిధిలో సబ్బులు, షాంపూలు కాలుష్యానికి కారణమయ్యే ఇతర వస్తువుల విక్రయాలు చేపట్టకుండా చూడాలని సూచించారు. అదేవిధంగా భక్తులు తమ దుస్తులను నీటిలో వదిలేయకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## రాజ్యసభలో క్షమాపణలు చెప్పిన మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ-నవభూమి:** రాజ్యసభలో ఇవాళ కాంగ్రెస్ ఎంపీ మల్లిఖార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో ఆయన డిప్యూటీ చైర్మెన్ హరివంశ్‌కు క్షమాపణలు చెప్పారు. జాతీయ ఎడ్యుకేషన్ పాలసీపై చర్చ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఎక్కడ ఉన్నారని ఖర్గే అన్నారు. ఆ సమయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని తోసి వేసేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. తోకేంగే అంటూ హిందీ పదాన్ని వాడారు. దీని పట్ల బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. చైర్‌ను చూస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికంగా ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. ఖర్గే క్షమాపణలు చెప్పాలని బీజేపీ నేత జేపీ నడ్డా డిమాండ్ చేశారు.తాను చేసిన వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెబుతున్నట్లు ఖర్గే తెలిపారు. ఖర్గే వ్యాఖ్యలను కూడా రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. కేవలం ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాలన్న ఉద్దేశంతో తాను అలా మాట్లాడానని, చైర్‌ను ఉద్దేశించి ఏ వ్యాఖ్యలు చేయలేదన్నారు. త్రిభాషా విధానాన్ని తమిళనాడు సర్కారు అమలు చేయడం లేదని ఎన్ఈపీపై మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో ఆయన తమిళనాడు సర్కారును తీవ్రంగా తప్పుపట్టారు. విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తూ.. అనాగరికంగా డీఎంకే ఎంపీలు వ్యవహరిస్తున్నట్లు మంత్రి ఆరోపించారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ.. డీఎంకే ఎంపీలు ధర్నా చేపట్టాయి. మంత్రి రాజీనామా కోరుతూ డీఎంకే ఎంపీలు ఆందోళన చేపట్టారు.

## ఢిల్లీ బీజేపీ కార్యాలయంలో హెూలీ మిలాన్.. ఆటపాటలతో నేతల సంబురాలు



**న్యూఢిల్లీ-నవభూమి:** హెూలీ పండుగ ను పురస్కరించుకుని ఢిల్లీ బీజేపీ నేతలు హెూలీ మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఢిల్లీ బీజేపీ కార్యాలయం లో ఈ కార్యక్రమం జరిగింది. ఢిల్లీ బీజేపీకి చెందిన ముఖ్య నాయకులంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే , ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఇతర బీజేపీ నాయకులు ఉన్నారు.ఈ సందర్భంగా నేతలు ఒకరిపై ఒకరు పూలు చల్లుకున్నారు. డీజే పాటలు పెట్టుకుని డ్యాన్సులు వేశారు. ఒకరికి ఒకరు హెూలీ మిలాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఢిల్లీలో బీజేపీ నేతల సంబురాలకు సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

# వారానికి 90 గంటల పని.. తీవ్రంగా నిరసిస్తూ రోడ్డెక్కిన ఉద్యోగులు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో గత కొన్నిరోజులుగా ఉద్యోగుల పని గంటలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఉద్యోగులు వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాగా.. ఆ తర్వాత ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఏకంగా వారానికి 90 గంటలు పనిచేయాలని పేర్కొనడం మరిన్ని తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాల నుంచి రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే నారాయణమూర్తి, ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ లాంటి ప్రముఖులు.. పని గంటలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు.. దేశంలోనే సిలికాన్ సిటీగా పేరు గాంచిన కర్ణాటక రాజధాని బెంగళూరులో రోడ్డెక్కారు.ఇటు ఉద్యోగం.. అటు కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకోలేక తీవ్ర సతమతం అవుతుంటే.. అదనపు గంటలు పని చేయాలని పరిశ్రమ పెద్దలు పిలుపునివ్వడంపై టెక్ ఉద్యోగులు తీవ్రంగా స్పందిస్తున్నారు. ఇప్పటివరకు తమ అభిప్రాయాలను కేవలం సోషల్ మీడియాలో వెల్లడించి.. తమ నిరసన వ్యక్తం చేయగా.. ఇప్పుడు ఏకంగా రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా బెంగళూరు నగరంలోని ఫ్రీడమ్ పార్క్ వద్ద ఇటీవల ఐటీ ఉద్యోగులు ధర్నా చేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ టెకీల ఆందోళనకు కార్మిక సంఘాల యూనియన్ అయిన సీఐటీయూ మద్దతు తెలపడంతో ఐటీ ఉద్యోగుల ఆందోళనలు మరింత తీవ్ర రూపం దాల్చినట్లు అయింది.టెక్ ఉద్యోగులు వారానికి 70 నుంచి 90 గంటలు పని చేయాలని పలు కంపెనీల సీఈఓలు, ఛైర్మన్‌లు పేర్కొంటున్నారు. అదే సమయంలో ఉద్యోగుల పని గంటలను ఇప్పుడు ఉన్న 8 గంటల నుంచి 14 గంటలకు పెంచాలని.. బెంగళూరులోని కంపెనీలు కర్ణాటకలో అధికారంలో ఉన్న సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. దీంతో ఐటీ ఉద్యోగులు కన్నెర్ర చేసి.. పని గంటలకు వ్యతిరేకంగా తమ నిరసన గళాన్ని విప్పాయి. ఆరోగ్యకరమైన పని గంటలు-జీవన సమతుల్యత ప్రతి ఉద్యోగి హక్కు అనే నినాదంతో టెకీలు ఇప్పుడు బెంగళూరు నగరంలో ఆందోళన బాట పట్టారు.అయితే టెక్ ఉద్యోగులకు మద్దతుగా సీఐటీయూ మద్దతుగా నిలిచింది. దీంతో ఈ పని గంటల ఉద్యమం క్రమంగా మరింత తీవ్రతరం కాబోతున్నదా అనే చర్చ ఇప్పుడు కర్ణాటకలోని రాజకీయ, కంపెనీల్లో నెలకొంది. ఐటీ ఉద్యోగ సంఘం గతేడాదే కర్ణాటక కార్మిక శాఖ మంత్రికి పని గంటల విషయంలో కంపెనీల ప్రవర్తన, తమ సమస్యలపై మెమోరాండం సమర్పించింది. అయినా సమస్యలు పరిష్కారం కాకపోగా.. అదనపు పని గంటలు అందుబాటులో ఉండాలని ఆయా సంస్థలు సంస్థలు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయంటూ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు.

## ఒక్కో రక్తపు బొట్టుకు రూ.3వేలు ఛార్జ్!

## మోకాళ్ల నొప్పులు తగ్గిస్తానని రిటైర్డ్ టీచర్‌కు బురిడి!





జబల్పూర్: మోకాళ్ల నొప్పులను తగ్గిస్తానని ఓ విశ్రాంత ఉపాధ్యాయుడిని బురిడి కొట్టించాడు ఓ మోసగాడు. విశ్రాంత ఉపాధ్యాయుడి చికిత్సకు రూ. 6. 5లక్షలు బిల్లు వేశాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్?లో జరిగింది.

**అసలేం జరిగిందంటే?**

జబల్పూర్‌లోని శివ్ నగర్ చెందిన కేఎల్ సోనీ(78) విశ్రాంత ఉపాధ్యాయుడు. ఆయన గత కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ఫిబ్రవరి 11న విజయనగర్?లోని ఒక మెడికల్ స్టోర్ నుంచి మందులను కొనుగోలు చేసి వస్తున్నారు సోనీ. కాళ్ల నొప్పుల కారణంగా కాస్త కుంటుతూ నడుస్తున్నారు. అప్పుడు ఓ యువకుడు సోనీని పిలిచి ఎందుకు కుంటుతూ నడుస్తున్నారని అడిగాడు. తనకు మోకాళ్ల నొప్పులు ఉన్నాయాని సోనీ చెప్పారు. తాను చాలా చోట్ల చికిత్స చేయించుకున్నానని, కానీ పూర్తిగా నయం కావడం లేదని తెలిపారు. దీన్ని ఆసరాగా చేసుకున్న మోసగాడు వృద్ధుడిని మాయలోకి దింపాడు.

**ఫేక్ డాక్టర్‌తో మోసం**

తన తల్లికి కూడా మోకాళ్ల సమస్యే ఉండేదని సోనీకి మోసగాడు చెప్పాడు. ఆమె నాగ్‌పూర్ నుంచి వచ్చిన ఆర్కే పటేల్ అనే వైద్యుడి వద్ద చికిత్స తీసుకుందని నమ్మబలికాడు. ఇప్పుడు తన తల్లి పూర్తి ఆరోగ్యంతో ఉందని తెలిపాడు. దీంతో మాయగాడి వలలో రిటైర్డ్ టీచర్ పడిపోయారు. ఈ క్రమంలో ఓ రోజు వృద్ధుడికి ఓ మహిళ ఫోన్ చేసింది. డాక్టర్ ఆర్కే పటేల్ నాగ్‌పూర్ నుంచి తమ దగ్గరకు వచ్చారని పేర్కొంది. మోకాలికి చికిత్స చేయడానికి ఒక ప్రత్యేకమైన పద్ధతి ఉందని చెప్పింది. ఆ చికిత్సతోనే తాను పూర్తిగా కోలుకున్నానని తెలిపింది.

**రక్తపు బొట్టుకు రూ.3 వేలు ఛార్జ్**

మరుసటి రోజు డాక్టర్ ఆర్కే పటేల్ సోనీ ఇంటికి వచ్చాడు. కాళ్లకు వైద్య పరీక్షలు చేశాడు. సోనీకి పెద్ద ఆరోగ్య సమస్య ఉందని భయాందోళనకు గురిచేశాడు. వెంటనే చికిత్స చేసుకోవాలని, లేదంటే ప్రమాదమని హెచ్చరించాడు. కొన్ని పరిస్థితుల్లో కాళ్లు కూడా తీసేయాల్సి రావొచ్చని అన్నాడు. సోనీ వైద్యుడి మాటలను నమ్మి చికిత్సకు అంగీకరించారు. ఓ ఇత్తడి పైపుతో సోనీ మోకాళ్ల నుంచి రక్తాన్ని బయటకు తీశాడు ఆ వైద్యుడు. చికిత్స కోసం ప్రతి రక్తపు చుక్కకు రూ. 3,000 వసూలు చేస్తానని చెప్పాడు. కొంత సమయం తర్వాత రూ. 6. 5లక్షలు బిల్లు అయ్యిందని చెప్పేసరికి సోనీ షాకయ్యారు. అప్పుడు తన దగ్గర ఉన్న దాదాపు రూ.లక్ష ఇచ్చారు. బిల్లు అందుకున్న తర్వాత నకిలీ వైద్యుడు ఈ చికిత్స గురించి ఎవరికీ చెప్పొద్దని సోనీని కోరాడు. అనంతరం కొన్ని మందులను రాసి అక్కడి నుంచి పరారయ్యాడు.

ఫేక్ డాక్టర్ ఇచ్చిన పెయిన్ కిల్లర్ మందు మోసాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు

నకిలీ వైద్యుడు ఇచ్చిన మందులను చీటీని పట్టుకుని మెడికల్ షాపునకు వెళ్లగా వాటి ధర రూ. 75 వేలని వృద్ధుడికి తెలిసింది. దీంతో అతడు మందులను కొనుగోలు చేయలేదు. అయినప్పటికీ తాను మోసపోయానని గ్రహించలేదు. ఒకరోజు మార్కెట్ నుంచి సోనీ కాస్త కుంటుతూ నడుచుకుని వస్తుండగా ఓ వ్యక్తి పాత తరహా ప్రశ్నే వేశాడు. మీ కాళ్లలో ఏమైనా నొప్పిగా ఉందా? అని అడిగాడు. తన తండ్రి కాలు నొప్పిని ఆర్కే పటేల్ అనే వైద్యుడు నయం చేశాడని అనడం వల్ల సోనీకి తాను మోసపోయానని అర్థమైంది. జరిగిన విషయాన్నంతా సోనీ తన కుమారుడికి చెప్పాడు. అప్పుడు జబల్పూర్?లోని విజయనగర్ పోలీస్ స్టేషన్ లో మోసగాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**బాధితుడు కేఎల్ సోనీ**

"ఈ సంఘటనకు సంబంధించిన కేసును దర్యాప్తు చేస్తున్నాం. రిటైర్డ్ టీచర్ అందించిన ఫోన్ నంబర్లు అన్నీ స్విచ్ ఆఫ్ వస్తున్నాయి. అయినప్పటికీ మొబైల్ నంబర్ల ఆధారంగా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నకిలీ వైద్యుడి పేరు ఆర్కే పటేల్. వృద్ధుడితో మాట్లాడిన మోసగాడి పేరు అరుణ్. " అని విజయనగర్ పోలీస్ స్టేషన్ ఇన్ చార్జ్ వీరేంద్ర పవార్ తెలిపారు.

## ప్రపంచంలో టాప్-20 అత్యంత కాలుష్య నగరాల్లో 13 భారత్‌లోనే



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రపంచంలో వాయు కాలుష్యం అత్యధికంగా ఉన్న టాప్-20 నగరాల జాబితాలో ఏకంగా 13 నగరాలు భారతదేశం నుంచే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024' నివేదిక విడుదలైంది. ఇందులో ప్రపంచంలో ఐదో అత్యంత కలుషిత దేశంగా భారత్ నిలిచింది.ఇక ఈ జాబితాలో అస్సాంలోని బైర్నిహాట్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో దేశ రాజధాని ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లన్‌పుర్, ఫరీదాబాద్, లోని (ఘజియాబాద్), న్యూ ఢిల్లీ, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, భివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. ఇక ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా ఢిల్లీ తొలి స్థానంలో కొనసాగుతోంది. 2023లో ఈ సంస్థ విడుదల చేసిన జాబితాలో ప్రపంచంలోని మూడో అత్యంత కలుషిత వాతావరణ దేశంగా భారత్ నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఐదో అత్యంత కలుషిత దేశంగా ఇండియా నిలిచింది.

## అదుపుతప్పి ఫల్టీలు కొడుతూ లోయలోకి దూసుకెళ్లిన టెంపో.. ముగ్గురు దుర్మరణం..!



**జమ్ముకశ్మీర్-నవభూమి:** జమ్ముకశ్మీర్ లో ఘోర ప్రమాదం జరిగింది. డ్రైవర్ సహా 13 మందితో వెళ్తున్న టెంపో అదుపుతప్పి ఫల్టీలు కొడుతూ రోడ్డు పక్కనున్న లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జమ్మూలోని ప్రభుత్వ ఆస్పత్రి టెంపో వ్యాన్ జమ్ము నుంచి సాంగ్లికోట్ వెళ్తుండగా రియాసీ జిల్లాలోని మహెూర్ వద్ద ప్రమాదానికి గురైంది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే రెస్క్యూ సిబ్బంది, స్థానికులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికిగల కారణం తెలియాల్సి ఉందని చెప్పారు.

## డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా స్టాలిన్ పోరు

### కలిసి రావాలని 6 రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం!



**చెన్నై- నవభూమి:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పోరును ముమ్మరం చేస్తున్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు చాలా అన్యాయం జరుగుతుందని ఆయన ఆరోపి స్తున్నారు. అందుకే ఆయా రాష్ట్రాలను ఏకతాటి పైకి తీసుకురావడం కోసం స్వయంగా రంగం లోకి దిగారు. మార్చి 22న చెన్నైలో నిర్వహిం చనున్న సమావేశానికి హాజరుకావాలని కోరుతూ 6 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలకు ఆహ్వానం పంపుతు న్నారు.మార్చి 5న చెన్నైలోని తమిళనాడు సచివాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో 58 పార్టీలు పాల్గొన్నాయి. అందులో వివిధ తీర్మానాలు ఆమోదించారు. డీలిమిటేషన్ వల్ల ప్రభావితమయ్యే రాష్ట్రాలను ఏకతాటిపైకి తీసుకురావడం ద్వారా ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. అందుకే స్టాలిన్ వివిధ రాష్ట్రాల సీఎంలకు, ముఖ్య రాజకీయ నేతలకు తమ మంత్రుల ద్వారా ఆహ్వానం పంపుతున్నారు.

**స్వయంగా లేఖలు**

బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకె శివకుమారర్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు, ఏపీ మాజీ సీఎం జగన్మోహన రెడ్డి, ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు స్వయంగా లేఖలు రాశారు స్టాలిన్. వీటిని తమ మంత్రులకు ఇచ్చి ఆయా రాష్ట్రాల సీఎంలను నేరుగా ఆహ్వానించమని చెప్పారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించేందుకు మార్చి 22న నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని వారందరినీ కోరాలని సూచించారు.

**మంత్రుల ద్వారా ఆహ్వానం**

తమిళనాడు పరిశ్రమల మంత్రి డీఆర్‌పీ రాజా నేతృత్వంలోని బృందం మార్చి 11న ఒడిశాకు వెళ్లి బిజు జనతాదళ్ నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు లేఖను అందించింది. మార్చి 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానించింది.

తమిళనాడు అటవీ మంత్రి పొన్ముడి, ఎంపీ అబ్దుల్లా నేతృత్వంలోని బృందం బుధవారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉపముఖ్యమంత్రి డీకె శివకుమార్‌ను కలువనుంది.మరుసటి రోజు తమిళనాడు మున్సిపల్ పరిపాలన మంత్రి కె.ఎన్.నెహ్రూ, ఎంపీ ఎన్.ఆర్.ఇళంగో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆహ్వాన లేఖలు అందించనున్నారు.

తమిళనాడు సమాచార, సాంకేతిక మంత్రి పీ.టీ.ఆర్ పళనివేల్ రాజన్ నేతృత్వంలోని బృందం కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసి ఆహ్వానించనుంది.

డీఎంకే నాయకురాలు కనిమొళి నేతృత్వంలోని బృందం బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఆహ్వానించనుంది.

## కోలుకున్న ముఖ్యమంత్రి మాతృమూర్తి..



**చెన్నై- నవభూమి:** గత నాలుగురోజులుగా అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందిన ముఖ్యమంత్రి స్టాలిన్ మాతృమూర్తి దయాళ్ అమ్మాళ్ చికిత్స తర్వాత పూర్తిగా కోలుకున్నారు. ఆదివారం రాత్రి ఆమె ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 5 రాత్రి శ్వాసకోశ సమస్య ఏర్పడి ఆమె అస్వస్థతకు గురయ్యారు.వెంటనే ఆమెను కుటుంబీకులు చికిత్స కోసం అపోలో ఆస్పత్రికి తరలించారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న ఆమెకు వైద్యనిపుణులు ఎమెర్జెన్సీ విభాగంలో చికిత్స అందించారు. రెండు రోజులకే ఆమె ఆరోగ్య కుదుటపడినా మరో రెండు రోజులు ఆమె ఆరోగ్య పరిస్థితి పరిశీలించిన మీదట డిశ్చార్జ్ చేశారు.

## సిబ్బంది పాయింట్ బ్లాంక్‌లో గన్ను - పట్టపగలే రెచ్చిపోయిన దొంగలు




**బిహార్:- నవభూమి:** బిహార్‌లో సినీఫక్కీలో బంగారు నగల చోరీ జరిగింది. ఎనిమిది మంది సాయుధులు భోజ్‌పుర్ జిల్లా ఆరా పట్టణంలోని తనిష్క్ బంగారు నగల షోరూంలోకి ప్రవేశించి సిబ్బందిపై తుపాకీ గురిపెట్టి రూ. 25 కోట్ల విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం 10 గంటలకు షోరూమ్‌ను తెరవగా ఎనిమిది మంది దుండగులు తుపాకులతో లోనికి ప్రవేశించారు. భద్రతా సిబ్బంది వద్ద ఉన్న తుపాకీని స్వాధీనం చేసుకొని షోరూంను మూసివేశారు. అనంతరం తమ వద్దనున్న ఆయుధాలతో షోరూం సిబ్బందిని దుండగులు బెదిరించారు. షోరూం సిబ్బంది మొత్తాన్ని ఒక చోట ఉంచి అల్మరాలు, పెట్టెల్లో ఉన్న నగలను మొత్తం దోచుకున్నారు. ఈ సమయంలో షోరూం సిబ్బంది ఒకరు రాగా దుండగులు అతడిపై దాడి చేశారు. ఈ దృశ్యాలన్నీ షోరూంలోని సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి.దుండగులు నగలతో ఉడాయించగానే షోరూం సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఖాకీలు వారిని వెంబడించారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు నిందితులు గాయపడ్డారు. వారిని అరెస్టు చేసిన పోలీసులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుమారు రూ. 25 కోట్ల విలువైన బంగారం ఆభరణాలు చోరికి గురయ్యాయని షోరూం మేనేజర్ తెలిపారు. దుండగులు ఎత్తుకెళ్లిన వాటిలో గోల్డ్ చైన్లు, నెక్‌లెస్‌లు, వజ్రాభరణలు ఉన్నాయని చెప్పారు. నిందితులు తుపాకులతో కొట్టడం వల్ల తమ సిబ్బంది ఇద్దరు గాయపడ్డారని వెల్లడించారు. దొంగతనానికి 8 నుంచి 9 మంది వచ్చారని చెప్పిన ఆయన వారిలో కొంత మంది తమ సిబ్బంది వద్ద ఉండగా మరికొందరు నగలను లూటీ చేశారని చెప్పారు. దోపిడీ జరిగిన సమయంలో షోరూంలో 25 మంది సిబ్బంది ఉన్నారని మేనేజర్ తెలిపారు.దోపిడి ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ బుధవారం 12 । మార్చి ।

## వైరలవుతున్న జూనియర్ ఎన్టీఆర్ కొత్త లుక్



ఇటీవల దేవర సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ అయితే తారక్ తన సినిమా సినిమాకి లుక్‌ని మారుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అభిమానుల అభిరుచులకు అనుగుణంగా సినిమా సినిమాకి మేకోవర్ మార్చుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఇప్పటికే వార్ 2 కోసం ప్రత్యేక లుక్‌లో ఉన్న తారక్ ప్రశాంత్ నీల్‌తో రాబోతున్న డ్రాగన్ ప్రాజెక్ట్ కోసం కొత్త లుక్ ట్రై చేస్తున్నాడు. అయితే తారక్ తాజాగా ఎవరూ ఊహించని లుక్‌తో కనిపించాడు. స్టైలిష్ క్రాఫ్, గడ్డం, గాగుల్స్ తో బ్లాక్ జీన్స్ ట్రౌజర్ వేసుకుని ఎయిర్‌పోర్ట్ నుంచి వెళుతుండగా కెమెరాలకు ఫోజులిచ్చాడు తారక్. కాగా ఇందుకు సంబంధించిన లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్ వార్ 2 సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నాడు. అయన్ ముఖర్జీ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్నాడు.



## సూపర్ హిట్ సిరీస్ సీక్వెల్‌పై రాశీ ఖన్నా క్లారిటీ



వెబ్ సిరీస్ అనగానే హిందీ ప్రేక్షకులతో పాటు అన్ని భాషల ప్రేక్షకులకు రాజ్ అండ్ డీకే పేర్లు గుర్తుకు వస్తాయి. ఆ స్థాయిలో వారి వెబ్ సిరీస్‌లు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఫ్యామిలీ మ్యాన్ రెండు సీజన్‌లు ఏ స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3ను సైతం రాజ్ అండ్ డీకే ప్రకటించారు. ఆ సిరీస్‌తో పాటు రక్త్ బ్రహ్మాండ్, గుల్కండ టేల్స్ సిరీస్‌లను సైతం ఈ దర్శక ద్వయం ప్రకటించారు. కానీ వీరు తాజాగా ప్రకటించిన వెబ్ సిరీస్‌ల జాబితాలో సూపర్ హిట్ అయి, ప్రేక్షకులను మెప్పించిన 'ఫర్జీ' సీజన్ 2 లేకపోవడంతో షాహిద్ కపూర్ అభిమానులు నిరాశను వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్ల కాలంలో రాజ్ అండ్ డీకేలు వరుసగా చేయబోతున్న వెబ్ సిరీస్‌లను ప్రకటించారు. అందులో ఫర్జీ లేకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వారికి ఫర్జీ వెబ్ సిరీస్ సీక్వెల్‌ను చేసే ఆలోచన లేదేమో అని, ఇతర ప్రాజెక్ట్‌లతో పోల్చితే ఫర్జీ వెబ్ సిరీస్‌ను వారు అంతగా పట్టించుకోవడం లేదేమో అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఫర్జీ వెబ్ సిరీస్ మొదటి సీజన్ చివర్లో రెండో సీజన్‌కి అవసరం అయ్యే విధంగా ముగింపు ఇచ్చారు. కనుక ఫర్జీకి ఇప్పుడు కాకున్నా ముందు ముందు అయినా కచ్చితంగా సీజన్ 2 వస్తుంది అనే నమ్మకంను ఇన్ని రోజులు షాహిద్ కపూర్ అభిమానులు కనబర్చుతూ వచ్చారు. తాజాగా రాజ్ అండ్ డీకే ప్రకటనతో అంతా నిరుత్సాహం వ్యక్తం చేశారు.నాగచైతన్య గుర్తులు ఇంకా అలానే.. ఫర్జీ వెబ్ సిరీస్ సీజన్ 2 కోసం వెయిట్ చేసే వారికి రాశి ఖన్నా గుడ్ న్యూస్ చెప్పింది. ఫర్జీ వెబ్ సిరీస్‌లో షాహిద్ కపూర్‌తో పాటు రాశి ఖన్నా నటించిన విషయం తెల్సిందే. హిందీలో రాశి ఖన్నాకు మంచి పేరు వచ్చింది. మరో కీలక పాత్రలో కావ్య థాపర్ నటించినప్పటికీ రాశి ఖన్నా పాత్ర గురించి ప్రముఖంగా చర్చ జరిగింది. అందుకే రాశి ఖన్నా సైతం ఫర్జీ సీజన్ 2 కోసం చాలా కాలంగా ఆసక్తిగా ఎదురు చూస్తుంది. ఆమెకి కచ్చితంగా ఫర్జీ 2 అనేది కెరీర్ బూస్ట్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయని అంతా భావిస్తున్నారు. అందుకే ఫర్జీ 2 కోసం రాశి ఖన్నా అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ధన శ్రీ ఇటీవల ఫర్జీ వెబ్ సిరీస్ సీజన్ 2 పై రాశి ఖన్నా స్పందించింది. ఆమె మాట్లాడుతూ.. తప్పకుండా వెబ్ సిరీస్ సీజన్ 2 వస్తుంది. ప్రస్తుతానికి స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంది. స్క్రిప్ట్ రెడీ కాని కారణంగా మేకర్స్ సీజన్ 2 గురించి చెప్పే పరిస్థితి లేదు. అందుకే ఇటీవల రాజ్ అండ్ డీకేలు వారి ఫ్యూచర్ ప్రాజెక్ట్స్‌లో ఈ సిరీస్‌ను చేర్చలేదని రాశి ఖన్నా అభిప్రాయం వ్యక్తం చేసింది. త్వరలోనే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తారని రాశి ఖన్నా నమ్మకం వ్యక్తం చేసింది. 2023లో అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అయిన ఫర్జీ వెబ్ సిరీస్ సీజన్ 2 కోసం మరికొంత కాలం వెయిట్ చేయాల్సి ఉంది. ఎప్పటి వరకు సిరీస్ వస్తుంది అనేది చూడాలి.

## స్త్రీలను తప్పుబట్టడం ట్రెండ్ అయిపోయింది: ధనశ్రీ




టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడకపోయినా కప్ గెలిచిన భారత జట్టు సభ్యులతో సమానంగా సోషల్ మీడియాలో అయితే ట్రెండింగ్ అవుతున్నాడు. దీనికి ముఖ్య కారణం ఆదివారం ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు ఈ క్రికెటర్ తన స్నేహితురాలు, రేడియో జాకీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సెర్ మహ్‌వష్‌తో కలిసి మ్యాచ్ చూడడానికి స్టేడియంకు వచ్చాడు. దీంతో ధనశ్రీ వర్మతో చాహల్‌కు విడాకులు అయిపోయా యని, అందుకే మహ్ వష్‌తో కలిసి మ్యాచ్ చూడడానికి వచ్చాడని సోషల్ మీడియా కోడై కూసింది. వీరిద్దరు సన్నిహితంగా, నవ్వూతూ పలుమార్లు ఈ మ్యాచ్ లైవ్‌లో కనపడడంతో చాహల్ కొత్త లవ్ స్టోరీ మొదలైందని, వారు ఇరువురూ కలిసి మ్యాచ్ చూస్తున్న ఫొటోలను నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. సూపర్ హిట్ సిరీస్ సీక్వెల్‌పై రాశి క్లారిటీ ప్రస్తుతం వీరి విడాకుల కేసు ముంబైలోని బాంద్రా కోర్టులో నడుస్తుందని, భరణంగా ధనశ్రీ వర్మ రూ.60 కోట్లు అడిగినట్టు జాతీయ మీడియాలో పలు కథనాలు వస్తున్నాయి. ఒక పక్క చాహల్-మహ్‌వష్ ఫొటోలు వైరలవడం, మరో వైపు ఈ భరణం వార్తలు సోషల్ మీడియాలో బాగా వైరలవడంతో ధనశ్రీ వర్మ ఇన్‌స్టాలో ఆసక్తికరమైన పోస్టు పెట్టింది. ఏ విషయంలోనైనా స్త్రీలను తప్పుబట్టడం ట్రెండ్ అయిపోయిందని ఆమె పోస్టు చేసింది. ఈ పోస్టుకు ముందు గతంలో చాహల్‌తో ఉన్న ఫొటోలను హైడ్ చేసిన ధనశ్రీ వర్మ వాటిని తిరిగి అన్ హైడ్ చేసింది. అయితే ఇప్పటివరకు చాహల్-ధనశ్రీ వర్మ నుంచి విడాకులపై అధికారిక ప్రకటన రాలేదు. వీరి తరఫున లాయర్లు మాత్రం ఈ విడాకుల కేసు కోర్టులో ఉన్నందున దయచేసి అవాస్తవాలను వార్తలుగా చిత్రీకరించి ప్రచారం చేయవద్దని అందరినీ కోరుతున్నారు.

## రీఎంట్రీకి సిద్ధమైన రంభ.. క్లారిటీ ఇచ్చిన తమిళ నిర్మాత



ముప్పై ఏళ్ళ క్రితం 'ఆ ఒక్కటి అడక్కు' సినిమాతో సినీ రంగం లోకి ఎంట్రీ ఇచ్చింది రంభ. తొలి సినిమానే రంభకు తిరుగులేని క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆ తర్వాత సూపర్ కృష్ణ, చిరంజీవి, సల్మాన్ ఖాన్, రజనీకాంత్, విజయ్, తదితర అగ్ర నటులతో నటించింది ఈ భామ. అయితే కొన్నేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్న ఆమె తాజాగా రీఎంట్రీకి సిద్ధమవుతు న్నారు. ఈ విషయంపై ప్రముఖ తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్పందించారు.రంభ మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. రంభ ఆర్థికంగా ప్రస్తుతం స్థిరంగా ఉన్నారు. ఆమె భర్త కూడా ఒక ప్రముఖ వ్యాపారి. అయితే అతడు కొన్ని రోజుల క్రితం నన్ను కలిసినప్పుడు రంభకు ఒక గొప్ప సినిమా ప్రాజెక్ట్‌లో అవకాశం కల్పించమని కోరారు. అటువంటి అవకాశం దొరికితే ఆమెను తప్పక సంప్రదిస్తానని ఆయనకు హామీ ఇచ్చాను అని తెలిపారు. ఈ విషయంతో, ఈ నటి త్వరలో సినీ రంగంలోకి మళ్లీ అడుగుపెడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. మరోవైపు రీ ఎంట్రీపై రంభ మాట్లాడుతూ సినీరంగంలోకి పునరాగమనానికి ఇదే సరైన సమయం అనుకుంటున్నా. నా వయసుకు తగినట్లు చాలెంజింగ్ రోల్స్ చేయడానికి సిద్ధంగా ఉన్నా. మంచి పాత్రల ద్వారా తిరిగి ప్రేక్షకుల అభిమానం సంపాదించుకోవాలనుకుంటున్నా అని చెప్పింది.

## బ్రేకప్ తర్వాత బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు..!



మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి సరిగ్గా రెండు దశాబ్దాలు అవుతుంది. టాలీవుడ్‌లో మంచు మనోజ్‌తో కలిసి 'శ్రీ' సినిమాలో నటించడం ద్వారా తెలుగు వారికి పరిచయం అయింది. హీరోయిన్‌గా తమన్నాకు మొదటి సినిమాతోనే నిరాశ మిగిలింది. తెలుగులో రెండేళ్ల తర్వాత మరోసారి ఛాన్స్ దక్కింది. శేఖర్ కమ్ముల హ్యాపీడేస్ సినిమాలో తమన్నాకు ఛాన్స్ దక్కడంతో కెరీర్ యూటర్న్ తీసుకుంది. హ్యాపీ డేస్ సినిమా సూపర్ హిట్ కావడంతో తమన్నాకి ఒక్కసారిగా టాలీవుడ్‌లో ఆఫర్లు వెల్లువెత్తాయి. తెలుగులో వరుస సినిమాలతో స్టార్ హీరోలతో సూపర్ హిట్ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది.టాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తున్న సమయంలోనే కోలీవుడ్‌లోనూ ఈ అమ్మడికి ఆఫర్లు వచ్చాయి. టాలీవుడ్, కోలీవుడ్‌లో సమాంతరంగా సినిమాలు చేస్తూ మిల్కీ బ్యూటీ సౌత్ స్టార్ హీరోయిన్ ట్యాగ్‌ను సొంతం చేసుకుంది. అప్పుడప్పుడు హిందీ సినిమాల్లోనూ నటించడం ద్వారా బాలీవుడ్‌లోనూ సత్తా చాటేందుకు ప్రయత్నాలు చేసింది. బాలీవుడ్ సినిమాతోనే ఎంట్రీ ఇచ్చిన తమన్నా తెలుగు, తమిళ్ సినిమాల కారణంగా అక్కడ రెండో సినిమాను చేయడంకు పది ఏళ్ల గ్యాప్ తీసుకుంది. పాన్ ఇండియా హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న తమన్నా ఇటీవల ప్రియుడు విజయ్ వర్మతో విడిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. అతడితో ప్రేమలో ఉన్న సమయంలో తమన్నా సినిమాలను ఆచితూచి ఎంపిక చేసుకుని వచ్చిందట.విజయ్‌తో పెళ్లి కోసం ఎదురు చూసిన తమన్నా వచ్చిన సినిమా ఆఫర్లను కొన్నింటిని వదిలేసిందట. కానీ విజయ్ మాత్రం ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదని చెప్పడంతో అతడి నుంచి బ్రేకప్ అయిందనే వార్తలు వస్తున్నాయి. విజయ్ నుంచి విడి పోయిన తర్వాత తమన్నా బిజీగా మారాలని ప్రయత్నిస్తుంది. వచ్చిన ఏ ఒక్క ఆఫర్‌ను వదిలి పెట్టకుండా, భాషతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలను చేస్తూ దూసుకు పోయే ప్రయత్నాలు చేస్తుంది. ఇటీవల కాలంలో తమన్నా మూడు ప్రాజెక్ట్‌లకు ఓకే చెప్పిందని తెలుస్తోంది. తమిళ్‌తో పాటు, తెలుగు, హిందీ ప్రాజెక్ట్‌లను ఈ అమ్మడు కమిట్ అయ్యేందుకు ఆసక్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.ఇంతకు ముందు కేవలం ఐటెం సాంగ్స్ చేయడం పై ఆసక్తి చూపించిన తమన్నా ఇప్పుడు లీడ్ రోల్స్ చేసేందుకు, చిన్న సినిమాల్లో నటించేందుకు రెడీగా ఉందని తెలుస్తోంది. అతి త్వరలోనే ఈమె మరో రెండు లేదా మూడు సినిమాలకు సైన్ చేయబో తుందనే వార్తలు వస్తున్నాయి. మొత్తానికి తమన్నా అభిమానులు చాలా సంతోషం వ్యక్తం చేసే విధంగా వరుస సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుంది. అదే సమయంలో సింగిల్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంది. బ్రేకప్ వార్తల నేపథ్యంలో తమన్నా మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొన్న తమన్నాను ప్రశ్నించేందుకు ప్రయత్నించగా ఆమె సైలెంట్‌గా అక్కడ నుంచి వెళ్లి పోయింది.

## సమంత లైఫ్.. నాగచైతన్య గుర్తులు ఇంకా అలానే..



టాలీవుడ్‌లోనే కాదు, పాన్ ఇండియా స్థాయిలో స్టార్‌గా ఎదిగిన సమంత తన వ్యక్తిగత జీవితం విషయంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఎదుర్కొంది. నాగ చైతన్యతో విడిపోయిన తర్వాత ఆమె జీవితంలో వచ్చిన మార్పులు మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయడమే కాకుండా, ఫ్యాషన్, వ్యక్తిగత జీవితం పరంగా కూడా ఆమె ప్రత్యేకమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోంది. తాజాగా, తన ఎంగేజ్‌మెంట్ రింగ్‌ను పెండెంట్‌గా మార్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది కేవలం ఒక ఆభరణపు మార్పు కాదు, తన కొత్త జీవితానికి ఇచ్చిన చిహ్నంగా కూడా భావించాలి. ఇక ఆమె మెడలో వేసుకునే గోలుసుకు జత చేసి ధరించినట్లు తెలుస్తోంది. సమంత, నాగ చైతన్యకు సంబంధించిన ఏ విషయం అయినా వెంటనే వైరల్ అవుతోంది. విడాకుల అనంతరం ఆమె చేతికి ఉన్న మూడు క్యారెట్ల డైమండ్ రింగ్ మాయం కావడంతో, అభిమానులు అనేక ఊహాగానాలు మొదలుపెట్టారు. %ూశ్రీంశీ =ముం% - సూపర్ హిట్ సిరీస్ సీక్వెల్‌పై రాశి క్లారిటీ ఈ రింగ్‌ను ఆమె ఇక ఉ ప యో గించ ర ని అర్థమైంది. కానీ, అ ది పూర్తిగా వదిలిపెట్టకుండా, ఒక మెడలో నెక్లెస్ లా మార్చుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇది ఆమె గతాన్ని మర్చిపోవడం కాదు, దానిని ఒక కొత్త అర్థంతో తన జీవితంలో నిలబెట్టుకోవడమనే అభిప్రాయాన్ని ఇస్తోంది. విడాకుల తర్వాత ఎంగేజ్‌మెంట్ రింగులను రీడిజైన్ చేసుకోవడం నేటితరం వారికి కొత్త ట్రెండ్ గా మారింది. ఇదే విధంగా, సమంత తన ఫ్యాషన్ ఎంపికల ద్వారా కూడా తన మనోభావాలను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోంది. 2024లో, తన తెలుపు రంగు వెడ్డింగ్ గౌన్‌ను బ్లాక్ బాడీకాన్ డ్రెస్‌గా మార్చుకుని వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. అభిమానులు దీన్ని "రివెంజ్ డ్రస్" అని అభివర్ణించారు. అయితే, సమంత మాత్రం దాన్ని కొత్త జీవితాన్ని స్వీకరించడమనే సందేశంగా మలిచింది. ఆమె సుస్థిరమైన ఫ్యాషన్ గురించి చర్చిస్తూ, వాడిన వస్త్రాలను మళ్లీ ఉపయోగించుకోవడం అవసరమని చెప్పింది. ఇదంతా చూసిన అభిమానులకు ఆమె స్టైల్ కేవలం ట్రెండ్ కోసం కాదని, తన జీవిత మార్గాన్ని ప్రతిబింబించేలా ఉంటుందని అర్థమైంది. అయితే, తన గతాన్ని పూర్తిగా తీసి పారేసే ప్రయత్నం మాత్రం సమంత చేయడం లేదు. ఆమె జీవితంలోని కొన్ని గుర్తుగా మిగిలిపోతున్నాయి. ముఖ్యంగా నాగ చైతన్యకు అంకితం చేసిన టాటూ ఇప్పటికీ ఆమె శరీరంపై ఉంది. అది పోగొట్టుకోవడం కష్టం అనే భావనా లేక ఇది కూడా ఒక గుర్తుగా ఉండాలని భావించిందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. %ూశ్రీంశీ =ముం% - స్త్రీలను తప్పుబట్టడం ట్రెండ్ అయిపోయింది: ధన శ్రీ కానీ, సమంత తన పద్ధతిలో జీవితాన్ని మళ్లీ నిర్మించుకుంటూ పోతుండటంతో, ఈ అంశాలు ఆమెను పెద్దగా ప్రభావితం చేయడం లేదు. సమంత ఇప్పుడు పూర్తిగా తన కెరీర్ పై దృష్టి పెట్టుకుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడం, తన జీవితాన్ని సరికొత్తగా తీర్చిదిద్దుకోవడం ఆమె ప్రధాన లక్ష్యంగా మారినట్లు కనిపిస్తోంది. ఆమె సినిమాల్లో చేస్తున్న ప్రయోగాలు, వ్యక్తిగత జీవితం లో తీసుకుంటున్న నిర్ణయాలు చూసినట్లయితే, ఆమె ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసే వ్యక్తి కాదని స్పష్టంగా అర్థమవుతోంది. వ్యక్తిగత జీవితం ఎంత కఠినమైనదైనా, దానిని తనదైన శైలిలో స్వీకరించి, ముందుకు సాగడమే ఆమె ధోరణిగా మారింది.

## ఐపీఎల్-2025 ప్రారంభానికి ముందే లక్నో సూపర్ జెయింట్స్‌కు షాక్..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్ 2025 ప్రారంభానికి ముందే లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ టోర్నీలో పలు మ్యాచులకు దూరమయ్యే అవకాశం ఉన్నది. మయాంక్ ఇంకా గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. గత సంవత్సరం బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ అరంగేట్రం తర్వాత వెన్నునొప్పి బారినపడ్డాడు. బెంగళూరులోని భారత క్రికెట్ నియంత్రణ బోర్డు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసంలో ఉన్నాడు. ఇటీవలే బౌలింగ్ సాధన ప్రారంభించాడు. మయాంక్ ఎప్పుడు మళ్లీ మైదానంలో అడుగుపెడుతాడన్నదాంట్లో క్లారిటీ లేదు. కానీ, ఓ నివేదిక ప్రకారం.. ఫిట్‌నెస్ మార్గదర్శకాలను పాటించగలిగితే ఐపీఎల్-2025 రెండో దశ వరకు లక్నో సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగేందుకు ఛాన్స్ ఉంది. మయాంక్ గత కొద్ది నెలలుగా గాయాలతో ఇబ్బందిపడుతున్నాడు. గత ఐపీఎల్ సీజన్‌లో 155 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి మయాంక్ వార్తల్లో నిలిచాడు. గాయం కారణంగా 2023 సీజన్ నుంచి తప్పుకున్నాడు.కానీ, గత సీజన్లో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో మూడు వికెట్లు తీశాడు. ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన తదుపరి మ్యాచ్‌లో కూడా మూడు వికెట్లు పడగొట్టాడు. దాని కారణంగా వరుసగా రెండు మ్యాచుల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అయితే, సైడ్ స్ట్రెయిన్ కారణంగా ఆడలేకపోయినందున కేవలం నాలుగు మ్యాచులకు దూరం కాగా.. గత సీజన్‌లో ఎక్కువ సమయం ఆటకు దూరమయ్యాడు. లక్నో ఫ్రాంచైజీ అతనిపై నమ్మకంతో ఉన్నది. మెగా వేలానికి ముందు రూ.11కోట్లకు మయాంక్‌ను రిటైన్ చేసుకుంది. లక్నో సూపర్‌జెయింట్స్ క్రికెట్ డైరెక్టర్‌గా నియమితులైన జహీర్ ఖాన్, మయాంక్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని విశ్వాసం వ్యక్తం చేశాడు.

## ఆసీస్, ఇంగ్లండ్ మధ్య క్రికెట్ బంధానికి 150 ఏళ్లు.. ఎంసీజీలో డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్



**మెల్‌బోర్న్-నవభూమి:** ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య క్రికెట్ బంధానికి 150 ఏళ్లు నిండింది. ఈ నేపథ్యంలో ఆ రెండు జట్లు డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్‌లో తలపడనున్నాయి. 2027 మార్చి 11 నుంచి 15వ తేదీ వరకు ఆ మ్యాచ్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనున్నది. సుమారు లక్ష మంది ప్రేక్షకులు ఆ మ్యాచ్‌ను వీక్షిస్తారు. ఈ రెండు జట్లు మొట్టమొదటిసారి 1877లో ఎంసీజీ వేదికగా తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 45 రన్స్‌తో విజయం సాధించింది. అయితే అదే వేదికపై రెండో టెస్టును ఇంగ్లండ్ గెలుచుకున్నది. దీంతో ఆ సిరీస్ 1-1తో సమం అయ్యింది.రెండు జట్ల మధ్య వందో టెస్టును కూడా ఎంసీజీలోనే నిర్వహించారు. 1977లో ఆ రెండు జట్లు తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 45 రన్స్ తేడాతో విజయం సాధించింది. 150వ వార్షిక టెస్టును ఎంసీజీలో గొప్ప నిర్వహిస్తామని, లైట్ల వెలుతురులో టెస్టు ఆడడం అద్భుతంగా ఉంటుందని, ఆధునిక టెస్టు క్రికెట్ రూపాంతరం చెందుతుందని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ తెలిపారు. 150వ టెస్టు జీవితకాల స్మృతులను మిగుల్చుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియా ఇప్పటి వరకు 13 డే అండ్ నైట్ టెస్టులు మ్యాచ్‌లు ఆడగా, దాంట్లో 12 మ్యాచుల్లో ఆ జట్టు విజయం సాధించింది.

## విడాకుల రూమర్స్.. చాహల్‌తో ఉన్న ఫొటోలను రీస్టోర్ చేసిన ధనశ్రీ



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమ్‌ఇండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ ధనశ్రీ వర్మ దంపతులు విడిపోతున్నారంటూ గత కొంత కాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. వీరిద్దరికీ విడాకులు కూడా మంజూరైనట్లు ఇటీవలే వార్తలు వచ్చాయి. ఈ విడాకుల రూమర్స్ వేళ ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. తన భర్త చాహల్‌తో ఉన్న ఫొటోలను ధనశ్రీ రీస్టోర్ చేసింది . దుబాయ్ వేదికగా ఆదివారం జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, రేడియో జాకీ మహ్‌వశ్ తో కలిసి చాహల్ వీక్షించిన విషయం తెలిసిందే. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత చాహల్‌తో ఉన్న ఫొటోలను ధనశ్రీ రీస్టోర్ చేయడం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.దంత వైద్యురాలైన ధనశ్రీ 2020 డిసెంబర్ 22న పెండ్లి చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది ధనశ్రీ. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తూనే ఉన్నారు. అయితే, ఇటీవలే ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' నేమ్‌ను తీసేయడంతో పాటు ఫొటోలను కూడా సోషల్ మీడియా నుంచి తొలగించింది. దీంతో ఈ జంట విడాకులు తీసుకోబోతోందంటూ పుకార్లు వ్యాపించాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**